V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శుక్రవారం
23-08-2024

సంపుటి : 01 | సంచిక : 111 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టం



**ఫార్మా కంపెనీ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ**

**లోపాలపై కమిటీ విచారిస్తుంది...**

**అచ్యుతాపురం బాధితులను పరామర్శించిన చంద్రబాబు..**

**విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి**

**విశ్వంభర, అనకాపల్లి:** అచ్యుతాపురం సెజ్ ఘటనపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. ప్రమాదం చోటుచేసుకున్న ఫార్మా కంపెనీని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50లక్షలు, గాయపడిన వారికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. "పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఫార్మా కంపెనీ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేస్తున్నాం.లోపాలపై కమిటీ విచారిస్తుంది. మిగతా2లో...

## ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం
# మరింత బలోపేతం




**భారత్, పోలండ్ మధ్య సామాజిక భద్రతా ఒప్పందం కుదిరింది**

- ఉభయ దేశాల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయి
- 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యం
- ప్రవాస భారతీయులు సమావేశంలో ప్రసంగించిన ప్రధాని మోదీ

**వార్సా:** భారత్, పోలండ్ మధ్య సామాజిక భద్రతా ఒప్పందం కుదిరినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. నూతన సాంకేతికతలు, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతమవుతోందని తెలిపారు. మోదీ బుధవారం పోలండ్‌కు చేరుకున్నారు. తొలుత అక్కడి ప్రవాస భారతీయులు మిగతా3లో...

**జనవరి నుండి రేషన్ దుకాణాల్లో**
# సన్న బియ్యం పంపిణీ

- తెల్లరేషన్ కార్డు దారులకు తీపి కబురు
- పి.డి.ఎస్ బియ్యం దారి తప్పితే కఠినచర్యలు
- పట్టుబడితే డీలర్ షిప్ రద్దు
- ప్రభుత్వానికి మచ్చ తెస్తే ఉపేక్షించేది లేదు
- ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్ వాడి,మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- రాష్ట్ర స్థాయి విజిలెన్స్ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:** తెల్ల రేషన్ కార్డు దారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే జనవరి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చౌక ధరల దుకణాలన్నింటిలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ సమావేశం జరిగింది. రాష్ట్ర రెవిన్యూ , సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల శాఖా కార్యదర్శి డి.ఎస్.చవాన్ లతో పాటు వైద్య ఆరోగ్య మిగతా2లో...




మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ ఈ దుష్ట చతుష్టయం .. దేశాన్ని పట్టి పీడిస్తోంది..దేశ సంపదను, ప్రజల సొమ్మును షేర్ మార్కెట్ల ద్వారా ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు దోచుపెడుతున్నారు..బీజేపీలో బీఆరెస్ విలీనం వ్యవహారం నిజం కాకపోతే ఆదానీ, బీఆరెస్ సెబీ వ్యవహారంలో ఎందుకు జేపీసీని డిమాండ్ చేయడం లేదు.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అదానీ వ్యవహారంపై జేపీసీ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు చేపట్టిన ధర్నాలో రేవంత్ రెడ్డి బీజేపీ, బీఆరెస్‌లపై విరుచుకపడ్డారు.

## దేశాన్ని పట్టిపీడిస్తున్న
# గుజరాత్ దుష్ట చతుష్టయం

**జాతి సంపదను...అదానీ, అంబానీలకు దోచిపెడుతున్న మోదీ**

సెబీ వ్యవహారంలో బీఆరెస్ ఎందుకు జేపీసీని డిమాండ్ చేయడం లేదు ?

బీజేపీ.. బీఆరెస్ ఒక్కటనేందుకు ఇదే నిదర్శనం

ఈడీ కార్యాలయం ముందు ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :**

మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ ఈ దుష్ట చతుష్టయం .. దేశాన్ని పట్టి పీడిస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. దేశ సంపదను, ప్రజల సొమ్మును షేర్ మార్కెట్ల ద్వారా ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు దోచుపెడుతున్నారని ఆరోపించారు. బీజేపీలో బీఆరెస్ విలీనం వ్యవహారం నిజం కాకపోతే ఆదానీ, బీఆరెస్ సెబీ వ్యవహారంలో ఎందుకు జేపీసీని డిమాండ్ చేయడం లేదని రేవంత్ ప్రశ్నించారు. ఆదానీ, సెబీ వ్యవహారంలో బీఆరెస్ తన వైఖరి ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.అదానీ వ్యవహారంపై జేపీసీ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఈడీ కార్యాలయాల ముందు ఆందోళనల్లో భాగంగా గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఈడీ కార్యాలయం వద్ద తెలంగాణ కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. తొలుత గన్ పార్కు వద్ద సమావేశమైన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అక్కడి నుంచి ఈడీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లారు. అదానీ వ్యవహారంపై మిగతా2లో...

## సమ్మె విరమించిన
# ఎయిమ్స్ వైద్యులు

- సుప్రీంకోర్టు సూచన మేరకు విరమిస్తున్నట్లు ఫైమా ప్రకటన
- వైద్యులు పనిచేయకపోతే ప్రజారోగ్య వ్యవస్థ ఎలా నడుస్తుందని ప్రశ్నించిన ధర్మాసనం..
- ఆందోళనల కారణంగా పేదలు నష్టపోకూడదని వ్యాఖ్య
- అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూస్తామని హామీ



2

## గద్దర్ అవార్డుల కోసం
# ప్రత్యేక కమిటీ

**ఛైర్మన్‌గా బి.నర్సింగరావు**

**వైస్ ఛైర్మన్‌గా దిల్‌రాజు**




**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు సినీ పరిశ్రమకు గద్దర్ పేరుతో అవార్డులు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మొదలుపెట్టింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, గద్దర్ అవార్డుల విధి విధానాలు, నియమ నిబంధనలు, మిగతా2లో...

# దేవుడిపై ఒట్టేసి రైతులను మోసం చేశారు

**యాదాద్రిలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపణ**

**రేవంత్ ప్రమాణం చేసిన అన్ని ఆలయాలకు వెళ్తామని ప్రకటన**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టేసి రైతులను దగా చేశారని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం మిగతా3లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



**నేటి చికెన్ ధరలు**

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 107 | ₹ 129 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 187 | ₹ 213 |



2

## రుణమాఫీ చేసే వరకు
# వదలిపెట్టం

**చేవెళ్ల ధర్నాలో కేటీఆర్ హెచ్చరిక**

**రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేసిన బీఆరెస్ శ్రేణులు**

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎటువంటి ఆంక్షల్లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల

## విజయవాడ హైవే పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

మంత్రి కోమటిరెడ్డి వెంకటట్ రెడ్డి

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్-విజయవాడ రహదారి (ఎన్.హెచ్-65)కి స్టాండింగ్ కమిటీ ఆమోదం లభించినందున ఈ హైవే కు ఇక మహర్దశ పట్టనుందని రోడ్లు భవనాల మిగతా2లో...

## తిహాడ్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

- ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు
- రేపు ఢిల్లీకి వెళ్లనున్న కేటీఆర్, హరీశ్‌రావు

2





## నాకు మంత్రి పదవి వార్తలు ఊహాగానాలే

- యూనివర్శిటీ వీసీల నియామకాల్లో
- సామాజిక సమీకరణల నేపథ్యంలో జాప్యం
- బీఆరెస్‌కు ఉద్యోగాల భర్తీపై మాట్లాడే నైతిక హక్కు లేదు
- ఎమ్మెల్సీ కోదండరామ్

3

# తిహాడ్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల మరోసారి అస్వస్థతకు గురయ్యారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత అస్వస్థతకు గురవగా.. జైలు అధికారులు ఆసుపత్రికి తరలించారు. దిల్లీ ఎయిమ్స్‌లో కవితకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టైన కవిత ప్రస్తుతం తీహాడ్ జైల్లో ఉన్న సంగతి విదితమే. కవిత వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. కవిత అస్వస్థతకు గురవడంతో.. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు శుక్రవారం దిల్లీ వెళ్లనున్నారు. వీరు కవితను పరామర్శించే అవకాశం ఉంది. నెల కిందట కూడా కవిత ఉన్నట్టుండి కళ్లు తిరిగి కింద పడిపోయారు. జైలు అధికారులు వెంటనే కవితను దీన్ దయాళ్ ఆసుపత్రికి తరలించారు. 5 నెలలుగా జైలులోనే ఉంటున్న కవిత.. పలుమార్లు జ్వరంతో బాధపడ్డారు. కొంతకాలంగా లో బీపీతో బాధపడుతున్నఆమె అరెస్టైన సమయంలోనూ అదే సమస్యతో ఉన్నారు. దీంతో వైద్యులు సూచించినట్టు ఇంటి నుంచే మెడిసిన్ అందిస్తున్నారు. అప్పుడప్పుడు జైలులో వైద్యులతో చికిత్స అందిస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె కవిత..దిల్లీ లిక్కర్ స్కాం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలతో అరెస్టయ్యారు. ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ప్రధానంగా కవిత పేరు వినిపించింది. పలుమార్లు విచారణ జరిపిన అధికారులు.. మార్చి 15న కవితను అదుపులోకి తీసుకున్నారు. మార్చి 26వ తేదీ నుంచి జ్యూడీయల్ ఖైదీగా కవిత తీహాడ్ జైలులో ఉన్నారు. బెయిల్ కోసం కవిత పిటిషన్లు దాఖలు చేయగా.. ప్రతిసారీ నిరాశే ఎదురైంది. సీబీఐ, ఈడీ కేసుల్లో తనకు బెయిలు ఇవ్వాలని కోరుతూ.. కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించగా జులై 1న బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. దాన్ని సవాలు చేస్తూ కవిత సుప్రీం కోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. కవితకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రతివాదుల వాదనలు వినకుండా మధ్యంతర ఉపశమనం కల్పించలేమని తెలిపింది. తాజాగా కవిత పిటిషన్ విచారణకు రాగా.. మళ్లీ ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది. దీంతో కవిత జైలులోనే ఉంటున్నారు.

### జనవరి నుండి రేషన్ దుకాణాల్లో

# సన్న బియ్యం పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)
,ఉన్నత విద్య,బి.సి సంక్షేమ, ఎస్.సి సంక్షేమ,గిరిజన సంక్షేమ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ తదితర మొత్తం ఎనిమిది శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పి.డి.ఎస్. బియ్యం దారి తప్పితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పి.డి.ఎస్ బియ్యం పట్టుబడితే తక్షణమే డీలర్ షిప్ రద్దు ఉంటుందన్నారు.అదే సమయంలో రేషన్ షాప్ డీలర్ల ఆదాయం పెంపు దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. అంతే గాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న1629 చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీకి వెంటనే ఉపక్రమించాలన్నారు.ప్రభుత్వ వసతి గృహాలతో పాటు అంగన్ వాడి,మధ్యాహ్న భోజనాలలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆయన సూచించారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తుంటే మార్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం లో బాగంగా లబ్ధిదారులకు వంటగ్యాస్ కు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పై లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యే విషయాన్ని వారికి ప్రస్ఫుటంగా చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## గద్దర్ అవార్డుల కోసం ప్రత్యేక కమిటీ

(మొదటి పేజీ తరువాయి)
లోగోను రూపొందించేందుకు సినీ ప్రముఖులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గద్దర్ అవార్డుల కమిటీకి ప్రముఖ దర్శకులు బి.నర్సింగరావు ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా దిల్‌రాజు వైస్ ఛైర్మన్‌గా ఉంటారని ప్రభుత్వం వెల్లడించింది. అలాగే కమిటీ సలహాదారులుగా దర్శకేంద్రుడు రాఘవేందర్ రావు, అందెశ్రీ, తమ్మారెడ్డి భరద్వాజ, దగ్గుబాటి సురేశ్ బాబు, చంద్రబోస్, ఆర్.నారాయణమూర్తి, వందేమాతరం శ్రీనివాస్, అల్లాణి శ్రీధర్, సానా యాదిరెడ్డి, హరీశ్ శంకర్, బలగం వేణులతోపాటు ఎఫ్‌డీసీ ఎండీ మెంబర్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎఫ్‌డీసీ ఈ కమిటీతో చర్చించి తదుపరి కార్యాచరణ మొదలుపెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ నివేదికల ఆధారంగా : గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రకటించిన అనంతరం చిత్ర పరిశ్రమ తమను సంప్రదించలేదని కొన్ని రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించిన నేపథ్యంలో వెంటనే అగ్ర కథానాయకుడు చిరంజీవి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రతిపాదనను ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఈ విషయమై దృష్టి సారించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. దీంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, గద్దర్ అవార్డులపై తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ)తో చర్చించి, విధి విధానాలను రూపొందించి ఎఫ్‌డీసీ ద్వారా ప్రభుత్వానికి అందజేశాయి. ఆ నివేదికల ఆధారంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులను ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

# దేశాన్ని పట్టిపీడిస్తున్న గుజరాత్ దుష్ట చతుష్టయం

(మొదటి పేజీ తరువాయి)
జేపీసీ దర్యాప్తు చేపట్టాలని ఆందోళన చేపట్టారు. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెబీ నిబంధనలు ఉల్లంఘించిన సెబీ చీఫ్ మాధబీ పురీ బచ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదానీ సంస్థలపైనా ఆరోపణలపై జేపీసీ విచారణకు ఆదేశించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు ఈడీ కార్యాలయంలోనికి వెళ్లి సెబీ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. ధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, బీఆరెస్‌లపై విమర్శలు గుప్పించారు.



**పారిపోయిన ప్రధాని మోదీ**
'అదానీ కుంభకోణంపై చట్ట సభల్లో సమాధానం ఇవ్వకుండా ప్రధాని మోదీ పారిపోయారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 2014 వరకు చేసిన అప్పు రూ.55 వేల కోట్లు. గత పదకొండేళ్లలో ప్రధాని మోదీ చేసిన అప్పు లక్షా 15 వేల కోట్లు. 16 మంది ప్రధానమంత్రులు చేసిన అప్పు కంటే మోదీ రెండింతలు అప్పులు చేశారు. దేశంలో సాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చిన ఘనత జవహర్ లాల్ నెహ్రూకు దక్కుతుంది. బ్యాంకుల జాతీయాకరణతో పేదలకు అందుబాటులోకి వచ్చాయి. సాహసోపేత నిర్ణయంతో పేదలకు భూములు పంచిన ఘనత ఇందిరమ్మకు దక్కుతుంది. దేశంలో సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్ ప్రవేశ పెట్టిన మహా నేత రాజీవ్ గాంధీ. హమ్ దో.. హమారే దో అన్నట్లు మోదీ అమిత్ షా వ్యవహారం ఉంది అని' సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**దోపిడీ దొంగలు..?**
'ప్రపంచాన్ని దోచుకునేలా మోదీ, అమిత్ షా వ్యవహార శైలి ఉంది. సెబీ ఛైర్ పర్సన్ తక్షణమే రాజీనామా చేయాలని లేదంటే కేంద్ర ప్రభుత్వం తొలగించాలి. కుంభకోణంపై ఈడీ విచారణ చేయాలని డిమాండ్ చేసారు. ఎంత గొప్ప స్థానంలో ఉన్నా సరే పార్టీ పిలుపునిస్తే పాటించాల్సిందే. నేను ముఖ్యమంత్రి అయినప్పటికీ ఒక కార్యకర్తగా నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చా. ఈ దేశానికి బీజేపీ నుంచి ముప్పు ఉంది. కుంభకోణంపై బీఆర్ఎస్ నేతలు బీజేపీని ఎందుకు ప్రశ్నించడం లేదు? వాళ్లు విలీనమైతరో మలినమైతరో మాకు సంబంధం లేదు. బీజేపీని కేసీఆర్ ఎందుకు ప్రశ్నించడం లేదు. ఈ దోపిడీ పై ట్విట్టర్ టిల్లు కేటీఆర్ ఎందుకు మాట్లాడటం లేదు. దేశ సంపదను దోచుకుంటున్న బీజేపీకి బీఆర్ఎస్ అనుకూలం అనడానికి ఇది నిదర్శనం అని' సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ, అమిత్‌షాలను మెప్పించేందుకే రాజీవ్ ఏయిర్ పోర్టు పేరు మారుస్తామని, రాజీవ్ గాంధీ విగ్రహం తొలగిస్తామని కేటీఆర్ చెబుతున్నారన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహం జోలికొస్తే కేటీఆర్ వీపు చింతపండు కావడం ఖాయమని, లేదంటే తనపేరు మార్చుకుంటానన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని బీఆరెస్ పాలకులు ఎందుకు పెట్టలేదన్నారు. మేం తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో లోపల వచ్చే డిసెంబర్ 9న ఏర్పాటు చేస్తామన్నారు. ఆ ప్రాంత పరిసరాల్లో రాజీవ్ విగ్రహం ఒక్కటే లేనందునే మేం ఏర్పాటు చేస్తున్నామన్నారు. రుణమాఫీ విషయంలో రైతులను బీఆరెస్‌నేతలు రెచ్చగొడుతున్నారని, వారి మాయలో రైతులు పడవద్దన్నారు. పదేళ్లు మిమ్మల్నిదోచుకున్నది ఈ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కదా, అందుకే ఆరు నెలల క్రితం మీరే కదా వారిని ఎన్నికల్లో బొంద పెట్టిందని,, మళ్లీ ఊర్లలోకి ఎందుకు రానిస్తున్నారన్నారు. వారిని హరీశ్‌రావు రాజీనామా చేయాల్సివస్తుందన్న భయంతోనే రైతు రుణమాఫీపై ఆందోళనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే సిద్ధిపేటలో మైనంపల్లి హనుమంతరావు సవాల్ చేసిండన్నారు. పదేళ్లలో వారు రైతులకు ఇచ్చింది ఎంత.. మేం పది నెలల్లో ఇచ్చిందెంతో అమరవీరుల స్థూపం వద్ద చర్చిద్ధామన్నారు. ఇప్పటికే 18వేల కోట్ల రూపాయలు వ్యవసాయ శాఖకు పంపించామని, 2 లక్షల పైన ఉన్నవారి కోసం 12వేల కోట్లు పంపిణీ చేస్తామన్నారు. రైతులకు ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని, మీ సమస్యలుంటే అధికారులను కలవండని, ఈ ప్రభుత్వం మీకోసం ప్రజాపాలనతో అందుబాటులో ఉందన్నారు. బీఆరెస్ వారితో కలిసి రొడ్డెక్కితే రైతులకు ఆయసమే మిగులుతుందన్నారు. పదేళ్లలో ఫామ్ హౌజ్‌లో కేసీఆర్ లాగా మేం పడుకోలేదని, రోజుకు 18 గంటలు పనిచేస్తున్నామని, మీ సమస్యలు ప్రభుత్వం వింటున్నప్పుడు రైతులకు ధర్నాలు ఎందుకని రైతులను ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ఎంత ఊదరగొట్టినా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 240క న్నా ఎక్కువ రావని, బీఆరెస్‌కు సున్నా సీట్లేనని చెప్పానని వారికి అవే దక్కాయన్నారు.

**మీ విధానమేంటి?**
'జేపీసీపై బీఆర్ఎస్ విధానం ఏంటో స్పష్టం చేయాలి. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మీ తాత ముత్తాతలు దిగొచ్చినా రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏం చేయలేరు. రాజీవ్ విగ్రహంపై చేయి వేస్తే వీపు చింతపండు అవుతుంది. ఎవరు తొలగిస్తారో రావాలి. ఏ తేదీన తీస్తారో చెప్పాలి. పదేళ్ల తరువాత వీరికి తెలంగాణ తల్లి గుర్తొచ్చింది. మాకు కనిపించే తెలంగాణ తల్లి సోనియమ్మ. ఆమె జన్మదినం డిసెంబర్ 9వ తేదీన సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. మేం తెలంగాణ తల్లికి నిజమైన వారసులం అని నిరూపించుకుంటాం. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వీరిని నమ్ముకుని రైతులు రోడ్డెక్కొద్దు. ఈ ప్రభుత్వం ఉన్నదే మీ కోసం. పదేళ్లలో బీఆర్ఎస్ వాళ్లు ఇచ్చింది ఎంత? పది నెలల్లో మేం ఇచ్చింది ఎంత? చర్చకు సిద్ధమా..? రాజీనామా చేయాల్సి వస్తుందని హరీశ్ రావు కొత్త డ్రామాలు ఆడుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 9 సీట్లు కూడా మిగలవు అని' సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఆ నలుగురి చేతిలో
## దేశ సంపద లూటీ

2014వరకు దేశం అప్పులు 55లక్షల కోట్ల అప్పులు చేస్తే ప్రధాని నరేంద మోదీ పాలనలో 183లక్షల కోట్ల అప్పులకు పెరిగిపోయాయని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. . దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే కాకుండా నెహ్రూ, ఇందిరా సహా కాంగ్రెస్ ప్రధానులు చేసిన అభివృద్ధిని, సంస్థలను నాశనం చేస్తున్నారన్నారు. . గుజరాత్‌కు చెందిన మహాత్మగాంధీ, సర్ధార్ వల్లభాయ్ పటేల్‌లో దేశం కోసం పనిచేస్తే, అదే ప్రాంతానికి చెందిన మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీలు దేశాన్ని దోచకుంటున్నారన్నారు. ప్రజల లక్షల కోట్ల సంపదను వారు ఏ విధంగా దోపిడి చేస్తున్నారో తెలిపేందుకు కాంగ్రెస్ ఈడీ కార్యాలయాల ముందు నిరసనలు చేపట్టామన్నారు. జాతీ సంపదను మోదీ, అమిత్ షాలు అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారన్న సంగతి ప్రజలు గ్రహించాలన్నారు. దేశాన్ని బీజేపీ బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలపై ఉందన్నారు. ఈ ఆందోళనలో మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షిద్ అలం ఖాన్ మంత్రులు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్పోరేషన్ల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

# రుణమాఫీ చేసే వరకు వదలిపెట్టం

(మొదటి పేజీ తరువాయి)
రుణమాఫీ చేయాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసే వరకు వదలిపెట్టమని ,.లేకుంటే రుణమాఫీపై తమ ఆందోళనలు తీవ్రతరం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. కోతలు లేకుండా రూ. 2 లక్షల వరకు సంపూర్ణ రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్ పార్టీ గురువారం రాష్ట్రవ్యాప్తంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా చేవెళ్లలో నిర్వహించిన బీఆర్ఎస్ ధర్నాలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్ అనేక హామీలు ఇచ్చారని, ఒక్క సంతకంతో డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామన్నారని గుర్తు చేశారు. రుణమాఫీ చేస్తామని అనేక దేవుళ్లపై ఒట్లు పెట్టిన సీఎం రేవంత్.. రుణమాఫీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ చేయకుండా దైవద్రోహానికి పాల్పడ్డారని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో దీనిపై ప్రశ్నిస్తే తమనే దబాయించారని, సభలో మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఏడిపించారని అన్నారు. రుణమాఫీ, హామీలపై సమాధానం చెప్పే దమ్ము సీఎం రేవంత్‌కు లేదన్నారు.భారాస హయాంలో లేని సాంకేతిక సమస్యలు ఇప్పుడెందుకు వస్తున్నాయి. రైతులు ఓట్లేసింది కాంగ్రెస్ నాయకులకు.. బ్యాంకు, వ్యవసాయాధికారులకు కాదు. రుణమాఫీ విషయంలో ఊరుకుంటే రైతుభరోసా అప్పుడు కూడా మోసం చేస్తారు. రైతులు కాంగ్రెస్ నేతల వెంటపడి నిలదీయాలి. ఇది తొలి అడుగు మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేసేదాకా వదిలిపెట్టం'' అని కేటీఆర్ అన్నారు.''రూ.2 లక్షల వరకు రుణమాఫీకి



రూ.49వేల కోట్లు అవుతాయని సీఎంకు బ్యాంకర్లు చెప్పారు. మంత్రివర్గంలో దీనికి రూ.31వేల కోట్లు అని పేర్కొంటూ తీర్మానం చేశారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టినపుడు రుణమాఫీకి రూ.26వేల కోట్లు కేటాయించారు. వందశాతం రైతుల రుణాలు మాఫీ చేసినట్లు సీఎం చెబుతున్నారు. ఆయన సొంతూరు కొండారెడ్డిపల్లెలో వందశాతం జరిగినట్లు నిరూపించాలని సవాల్ విసిరితే సమాధానం లేదు. ఆరు గ్యారంటీలు, ప్రజలకు ఇచ్చిన ఇతర వాగ్దానాల అమలుపై సమాధానం చెప్పే సత్తా లేదన్నారు .

**ప్రజాపాలనలో ప్రశ్నించడమే పాపమా..**
ప్రజాపాలనలో ప్రశ్నించటమే పాపమా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. రైతులు, విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు ఎవరు ప్రశ్నించినా.. అయితే పోలీసులు లేదంటే మీ గుండాలను ప్రయోగిస్తారా అని ప్రశ్నించారు.ఇలాంటి తాటాకు చప్పుళ్లకు తెలంగాణా భయపడదని కేటీఆర్ స్పష్టం చేశారు. గుర్తు పెట్టుకో మిస్టర్ చీ(ప్)ఫ్ మినిస్టర్... ఎంత అణిచివేస్తే అంత ఎదురు తిరుగుతామని హెచ్చరించారు. ఏడాది కూడా తిరగకముందే ఇంత ఫ్రస్టేషనా? అని ప్రశ్నించారు. రుణమాఫీ పై ప్రశ్నిస్తేనే బెదిరిపోతున్నారు, భయపడుతున్నారని.. ఇంకా మీ ఆరు గ్యారంటీలు...420 హామీల గురించి అడిగితే ఏమైపోతారో అని ఎద్దేవా చేశారు. పరిపాలన అంటే పచ్చి బూతులు, పిచ్చి మాటలు అనుకున్నావా అని కేటీఆర్‌ను నిలదీశారు. పూర్వాశ్రమంలో ప్రవర్తించినట్లే ప్రవరిస్తే అందలమెక్కించటానికి ఇది కాంగ్రెస్ పార్టీ కాదు... తెలంగాణ అని అన్నారు. నువ్వు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజలు నిన్ను వదలరని అన్నారు. వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుంది, వెంటాడి, వేటాడుతుందని స్పష్టం చేశారు.

# సమ్మె విరమించిన ఎయిమ్స్ వైద్యులు

దిల్లీ: కోల్‌కతా వైద్య విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీ ఎయిమ్స్, ఆర్ఎంఎల్‌తో పాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. 11 రోజులుగా కొనసాగుతున్న ఈ ఆందోళనలు విరమిస్తున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) ప్రకటించింది. సుప్రీం కోర్టు ఇచ్చిన హామీ, ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్కతా వైద్యురాలి హత్యాచార ఘటన పై సుప్రీంకోర్టు గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ ఘటనను నిరసిస్తూ గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్న వైద్యులు తక్షణమే విధుల్లో చేరాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది.వైద్యులు పనిచేయకపోతే ప్రజారోగ్య వ్యవస్థ ఎలా నడుస్తుందని ప్రశ్నించిన ధర్మాసనం.. ఆందోళనల కారణంగా పేదలు నష్టపోకూడదని వ్యాఖ్యానించింది. వెంటనే విధుల్లో చేరాలని.. ఆందోళనలు చేపట్టిన వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే దిల్లీ ఎయిమ్స్ వైద్యులు ఆందోళనలు విరమించారు.

# విజయవాడ హైవే పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు . ఈ రోడ్డు పనులకు స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ ఆమోదం తెలిపిందని, 2 నెలల్లో టెండర్లు పిలిచి నవంబరు నాటికి ప్రారంభిస్తామన్నారు. సచివాలయంలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయిందని.. మిగిలిన కొద్దిపాటి భూసేకరణ సెప్టెంబరు 15 నాటికి పూర్తిచేసి కేంద్రానికి పంపిన వెంటనే టెండర్లకు నోటిఫికేషన్ వస్తుందని చెప్పారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులను పరిశీలించానని, కాంట్రాక్టును వేరేవారికి ఇచ్చి కొత్తగా పనులు చేపట్టబోతున్నామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని దిల్లీలో కలిసి రాష్ట్రంలో నిర్మిస్తున్న జాతీయ రహదారుల పనులకు సహకారం కోరతామన్నారు. రైతులకు నష్టం లేకుండా పరిహారం చెల్లించేలా ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి సంబంధించి భూసేకరణను ప్రారంభించాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వం చేసే మంచిపనులపై బురదజల్లి భారాస నేతలు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.



# సీఎం రేవంత్ రెడ్డితో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ భేటీ

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్విలిన్ హ్యూ గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వివిధ రకాల పంటలకు సంబంధించి అధిక దిగుబడిని అందించే కొత్త వంగడాలపై పరిశోధనలు చేపట్టాలని ఆమెకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టం

(మొదటి పేజీ తరువాయి)
నివేదిక వచ్చాక ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టం.. శిక్షిస్తామన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం" అని చంద్రబాబు తెలిపారు.మీడియా సమావేశంలో మంత్రులు అనిత, సుభాష్, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం బాధితులను పరామర్శించిన చంద్రబాబు..

విశాఖపట్నం అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీ రియాక్టర్ పేలిన ఘటనలో ప్రమాద కుటుంబాలను ఏపీ సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి బయలుదేరిన సీఎం విశాఖకు చేరుకున్నారు.మెడికవర్, కేజీహెచ్‌లో చికిత్సపొందుతున్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితుల వద్దకెళ్లి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎంత ఖర్చు అయినా అందరికీ వైద్య సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి ప్లాస్టిక్ సర్జరీ కూడా చేయిస్తామని హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా ఇచ్చారు. మేము అన్నీ చూసుకుంటామని భరోసా కల్పించారు.ఫార్మా కంపెనీలో జరిగిన ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. ఈ ఘటనలో 17 మంది మరణించారని, 36 మందికి గాయాలయ్యాయని తెలిపారు. 10 మందికి తీవ్రగాయాలయ్యాయని,26 మందికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు.బాధితులందరికీ ఉత్తమ వైద్య సేవలందించాలని ఆదేశించామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. కోటి, తీవ్రంగా గాయపడ్డవారికి రూ. 50 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.25 లక్షలు పరిహారం అందజేస్తామన్నారు.

**లోపాలపై కమిటీ విచారిస్తుంది...**
రియాక్టర్ పేలిన ఫార్మా కంపెనీని సందర్శించి అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అచ్యుతాపురంలో మీడియా సమావేశంలో ఘటన వివరాలను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఘటన జరిగిన ఫార్మా కంపెనీ యాజమాన్యంలోనూ అంతర్గత సమస్యలున్నట్టు గుర్తించామని తెలిపారు. ఇక్కడ నిబంధనల మేరకు ఎస్ వోపీ అనుసరించలేదని తెలుస్తోంది. పరిశ్రమల్లో పూర్తిస్థాయి భద్రతా ప్రమాణాలు చేపట్టలేదు.పరిశ్రమల్లో వెంటనే అంతర్గత విచారణ చేపట్టాలి. రెడ్ కేటగిరిలోని పరిశ్రమలన్నీ కచ్చితంగా ఎస్ వోపీని పాటించాలి. ఎసెన్షియా ఫార్మా కంపెనీ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేస్తున్నాం. పరిశ్రమలో ఏం జరిగింది. లోపాలపై కమిటీ విచారిస్తుందని వెల్లడించారు.రాష్ట్రంలోని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ కోసం కమిటీ ఏర్పాటు చేస్తామని, ఈ కమిటీలో అన్ని విభాగాలను చెందిన అధికారులు ఉంటారని, ఈ కమిటీ విడివిడిగా కాకుండా ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించి నివేదికలను అందిస్తుందన్నారు. పరిశ్రమలు రావాలి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలని అదేస్థాయిలో పరిశ్రమల్లో కార్మికులు, ఉద్యోగుల భద్రత , ప్రజల భద్రతకు కూడ అంతే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. రాంబిల్లి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.2019-24 వరకు ఉన్న వైసీపీ పాలనలో విశాఖలో 119 సంఘటనల్లో 120 మంది మృతి చెందారని ఆరోపించారు. రెడ్ క్యాటగిరీలోని పరిశ్రమలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**అచ్యుతాపురం ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి**
ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఘోర ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల



కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు పీఎం సహాయ నిధి నుంచి పరిహారం అందిస్తామని ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు చొప్పున పరిహారం అందిస్తామన్నారు. గాయపడిన వారికి రూ. 50వేలు చొప్పున పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

# దేవుడిపై ఒట్టేసి రైతులను మోసం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ అంశంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆయన ఆలయాల పర్యటన చేపట్టారు. దీనిలో భాగంగా తొలుత యాదాద్రి నారసింహుడిని దర్శించుకున్నారు.. తెలంగాణ ప్రజలకు ఎలాంటి కీడు జరగొద్దని కోరుతూ ఆలయంలో పాప పరిహార పూజలు చేసినట్లు తెలిపారు ఎన్ని కేసులు పెట్టినా చివరి రైతుకు రుణమాఫీ జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రపంచం తలకిందులు అయినా ఆగస్టు పదిహేను వరకు రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్.. మాట తప్పారని విమర్శించారు. రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పాలకుడు మాట తప్పితే తెలంగాణ ప్రజలకు ఎలాంటి కీడు జరగొద్దని కోరుతూ ఆలయంలో పాప పరిహార పూజలు చేసినట్లు తెలిపారు. 'రైతులనే కాదు దేవుడిని రేవంత్ మోసం చేశాడు. కేసీఆర్ ఆదేశిస్తే మంత్రి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన చరిత్ర నాది. పార్టీ మారిన చరిత్ర నీది. రేవంత్ రుణమాఫీ అయింది అంటున్నాడు. మంత్రులు కాలేదని అంటున్నారు. ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల రుణమాఫీ పూర్తిగా కాలేదని అంటున్నారు. 42 లక్షల మందిలో 20



లక్షల మందికే రుణమాఫీ అయింది. 46 శాతం మాత్రమే రుణమాఫీ పూర్తి అయ్యింది. దేవుళ్లపై ప్రమాణం చేసి రైతుల్ని మోసం చేసిన ప్రభుత్వం కాంగ్రెస్‌దని ధ్వజమెత్తారు. బహిరంగంగా రేవంత్ క్షమాపణ చెప్పాలన్నారు . దేవుళ్ల వద్దకు వెళ్లి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. తెలంగాణ ప్రజల మొఖం చూసి రేవంత్ ను క్షమించాలని లక్ష్మీ నరసింహస్వామిని ప్రార్థించా. బోనస్ ఇస్తామని మోసం చేశాడని . రైతులు, అన్ని వర్గాల పక్షాన పోరాడే శక్తిని ఇవ్వాలని దేవుణ్ణి కోరామన్నారు . వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మూడు వందల రోజులు వచ్చినా అమలు కాలేదని తెలిపారు.

రుణమాఫీ ఎంత మందికి చేశావో శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేసారు. రైతు భరోసా కింద 7500 కోట్లు గతంలో కేసీఆర్ ఇచ్చేవారు. అవెప్పుడు ఇస్తావు? స్పీకర్, ఎమ్మెల్యేలకు రుణమాఫీ చేసి చిన్న చిన్న ఉద్యోగులకు ఎందుకు కోత పెడుతున్నావు? రేవంత్ ప్రమాణం చేసిన అన్ని చోట్లకు పోతామన్నారు రేవంత్ దేవాలయాలన్నింటినీ శుద్ధి చేయాలన్నారు. కాంగ్రెస్ మంత్రులు వెరైటీగా ఉన్నరని , రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయమంటే తనను రాజీనామా చేయమంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ధర్నాలు నిషేధం అంటూ రైతులకు పోలీసులు నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. జర్నలిస్ట్ సరితపై రేవంత్ అనుచరులు దాడి చేశారన్నారు . ఆదిలాబాద్‌లో పోలీస్ యాక్ట్ తీసుకొచ్చారని వీటన్నింటినీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు . లాఠీలతో మోసాన్ని అడ్డుకోలేరన్నారు . రుణమాఫీ చేస్తామని రైతులతో రైతులతో రణం చేస్తున్నాడని దుయ్యబట్టారు . రుణమాఫీ కాలేదంటే రైతులపై కేసులు పెట్టి వేధిస్తున్నావు. ఇందిరమ్మ రాజ్యం అంటే అణచివేయడమా?' అంటూ హరీశ్‌రావు మండిపడ్డారు.

# ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం



(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. భారత ప్రధానుల్లో ఎవరూ గత 45 ఏళ్లలో పోలండ్కు వెళ్లలేదు. చివరిసారిగా 1979లో నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలండ్ను సందర్శించారు-.ఈ ఏడాది తొలిసారిగా పోలండ్ కబడ్డీ చాంపియన్షిప్‌నకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ నేపథ్యంలో భారత్, పోలండ్ మధ్య అనుబంధానికి ఈ ఆట మూలంగా ఉద్భవించిందని మోదీ గుర్తుచేశారు. భారత్ నుంచే కబడ్డీ పోలండ్‌కు చేరుకుందని తెలిపారు. దాన్ని ఆ దేశం మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలండ్ కబడ్డీ జట్టుకు మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్, అధ్యక్షుడు ఆండ్రెజ్ డుడాతో భేటీ కానున్నట్లు వెల్లడించారు. ఉభయ దేశాల మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయన్నారు. అందులో ప్రజాస్వామ్య విలువలు ఒకటని తెలిపారు. భారత్లో ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను గుర్తుచేశారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆర్థికంగా గత పదేళ్లలో భారత్ సాధించిన విజయాలను వివరించారు. అలాగే రాబోయే రోజుల్లో సాధించాల్సిన అనేక అంశాలను ప్రవాసభారతీయుల ముందు ప్రస్తావించారు. డిజిటల్ ఇండియా, సమ్మిళిత ఆర్థిక వృద్ధిలో సాధించిన పురోగతిని వివరించారు. బుధవారం పోలండ్ రాజధాని వార్సాకు చేరుకున్న మోదీ శుక్రవారం అక్కడినుంచి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు రైల్లో వెళ్తారు. 1991లో సోవియెట్ యూనియన్ నుంచి విడిపోయి పూర్తిస్థాయి దేశంగా ఉక్రెయిన్ ఆవిర్భవించాక భారత ప్రధాని అక్కడకు వెళ్లడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్కు స్నేహితుడిగా, భాగస్వామిగా ఆ ప్రాంతంలో సత్వరం శాంతి, సుస్థిరతలు నెలకొనాలని భారత్ ఆకాంక్షిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ఉక్రెయిన్ ఘర్షణకు శాంతియుత పరిష్కారం లభించడానికి ఆ దేశాధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీతో వివిధ దృక్కోణాలను పంచుకోనున్నట్లు వెల్లడించారు.




## నాకు మంత్రి పదవి వార్తలు

# ఊహాగానాలే



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు కల్పించబోతున్నట్లుగా జరుగుతున్న ప్రచారం ఊహాగానం మాత్రమేనని, మంత్రి పదవిపై ఎలాంటి చర్చకు అస్కారం లేదని ఎమ్మెల్సీ, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో పిచ్చాపాటీగా మాట్లాడారు. యూనివర్సిటీ t వీసీల నియామకాల్లో సామాజిక సమీకరణల నేపథ్యంలో జాప్యం జరుగుతోందని, గత ప్రభుత్వం పోస్టులు వేయకుండా నిరుద్యోగుల ప్రాణాలను తీసుకుందన్నారు. బీఆరెస్‌కు ఉద్యోగాల భర్తీపై మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణ ఉద్యమం పుట్టినప్పటి నుంచి మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం జోన్లను ఇష్టారాజ్యంగా చేశారని, జిల్లాలు అనాలోచితంగా చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహం విషయంలో విద్వేషపూరితంగా పోవాల్సిన అవసరం లేదని, రాజీవ్ గాంధీ, తెలంగాణ విగ్రహం రెండు సచివాలయం ప్రాంగణంలో పెట్టవచ్చన్నారు. హైడ్రా కూల్చివేతలపై అది తప్పుంది.. ఇది తప్పుందని కేటీఆర్ చెబుతున్నారని, పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఏంచేశారని కోదండరామ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ చేసి నీతులు మాట్లాడటం సిగ్గు చేటని దుయ్యబట్టారు. గ్రూపు 1,2,3,4 లకు కలిపి ఒకే పరీక్ష నిర్వహించాలని, గ్రూపు పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రజల మనిషికి భద్రత అవసరం లేదు ...**

తాను ప్రజల మనిషినని, వ్యక్తిగత భద్రతా సిబ్బంది తనకు అవసరం లేదని కోదండరాం స్పష్టం చేశారు.గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఉన్న తనకు ప్రభుత్వం కేటాయించిన సెక్యూరిటీని నిరాకరించినట్లుగా తెలిపారు. సెక్యూరిటీ వల్ల ప్రజలతో సత్సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా తనకు తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. భద్రతా సిబ్బంది ఉంటే ప్రజలు తన వద్దకు రాకుండా నిలువరించే ప్రమాదం లేకపోలేదని అభిప్రాయపడ్డారు.



## ఎమ్మెస్సీలో నూతనంగా రెండు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు

**విశ్వంభర, హైదరాబాద్:** స్థానిక నారాయగూడలోని కేశవ్ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్సెస్ లో ఈ విద్య సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ రెండు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రవేశ పెట్టారు. మారుతున్న జీవన శైలికి, మార్కెట్ అవసరాలకు అనుసంధానంగా వుండే ఉన్నత విద్యను విద్యార్థులకు నాణ్యమైన రీతిలో అందించే ఉద్దేశ్యంతో యీ కోర్సులను అందిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శాంతి వివరించారు. ఇంత వరకు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల విభాగంలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీలలో వివిధ స్పెషలైజేషన్లలో విద్యార్థులకు ఎనలేని కృషి చేస్తున్నట్టు ఆమె వివరించారు. విద్యార్థుల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం విద్యా విధానాలను, కోర్సులను నిత్యనూతనంగా రూపుదిద్దుకుంటు విద్యార్థుల అవసరాలను తీర్చడమే కళాశాల ప్రధాన దృక్పథం అని శాంతి అన్నారు.

# హైడ్రాను రద్దు చేయాల్సిందే

- అలా తీర్మానం చేయాలని ఎంఐఎం సభ్యుల పట్టు
- జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చ
- అనుమతించని మేయర్
- 7 ఇతర ప్రతిపాదనలకు ఆమోదం

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రేటర్ పరిధిలోని ట్రై సిటీలో నున్న సర్కారు భూములు చెరువులు నాలాలనులను కాపాడేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా పై గురువారం జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో వివాదం చోటుచేసుకుంది. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మొత్తం 15 మంది సభ్యులు హాజరు కావలసి ఉండగా 11 మంది సభ్యులు హాజరయ్యారు . వీరిలో ఎంఐఎం సభ్యులు లేచి హైడ్రా రద్దుకు తీర్మానం చేయాలని పట్టుబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థకు జీహెచ్ఎంసీ నుంచి సిబ్బంది, వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడం ఏమిటి అని ఎంఐఎం సభ్యులు ప్రశ్నించారు. వెంటనే స్టాండింగ్ కమిటీ లో హైడ్రా రద్దుకు తీర్మానం చేయాలని పట్టు పట్టారు. అందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అంగీకరించకపోవడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో 7 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారన్నారు. నగర అభివృద్ధికి కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి కాట, స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మహమ్మద్ ముజాఫర్ హుస్సేన్, మహమ్మద్ ఖదీర్, మహమ్మద్ నజీర్ ఉద్దీన్, మన్నె కవితా రెడ్డి, మహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబిహ బేగం, ఆవుల రవీందర్ రెడ్డి, చింతల విజయ్ శాంతి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, అధికారులు ఈ ఎన్ సి జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, నళిని పద్మావతి, గీతా రాధిక, యాదగిరి రావు, చంద్రకాంత్ రెడ్డి, జోనల్ కమిషనర్లు వెంకన్న, రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, సిసిపి శ్రీనివాస్, చీఫ్ అకౌంట్స్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఎస్.ఇ కృష్ణారావు, సి.ఈ దేవానంద్, సెక్రటరీ సత్యనారాయణ, చీఫ్ వెటర్నరి డాక్టర్ అబ్దుల్ వకీల్, శానిటేషన్, లేక్స్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

**స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు**

1. నాలుగు లైన్ల బై డైరెక్షన్ ఎలివేషన్ కారిడార్ ఇందిరా పార్క్ నుండి వి.ఎస్.టి వరకు ఎన్టీఆర్ స్టేడియం, వి.ఎస్.టి మెయిన్ రోడ్ అశోక్ నగర్ జంక్షన్ ఆర్ టి సి క్రాస్ రోడ్డు మీదుగా ఫ్లై ఓవర్ పనులు, బాగ్ లింగంపల్లి జంక్షన్ నుండి మూడు లైన్ల బై డైరెక్షన్ ఎలివేటెడ్ కారిడార్, రామ్ నగర్ నుండి బాగ్ లింగంపల్లి వి.ఎస్.టి మీదుగా సెకండ్ లెవెల్ ఇండియన్ హు మే పైప్ కో.లిమిటెడ్, వి ఎస్ టి వరకు నిర్మించే రోడ్డు పనులకు రివైజ్డ్ అంచనా వ్యయం రూ.565 కోట్లు ప్రతిపాదించారు. అందులో రూ.426 కోట్లు ఖర్చు కాగా, గతంలో మంజూరు అయిన మొత్తం నుండి 139 కోట్ల రూపాయలకు చెల్లించేందుకు పరిపాలన మంజూరు చేయడానికి ఆమోదం.
2. స్లమ్ ఏరియా లోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సి.ఎస్.ఆర్ కింద డా.విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్ కు ఒక సంవత్సర కాలానికి బొల్లారం లోని మోడల్ మార్కెట్ బిల్డింగ్ ను ఇచ్చుటకు, ఒప్పందం చేసుకునేందుకు కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కు అనుమతి కోసం కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
3. మార్చి 2024 నుండి మే, 2024 వరకు జీహెచ్ఎంసీ కి సంబంధించిన ఆదాయ, వ్యయాలు.
4. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) ఆన్ లైన్ పోర్టల్ లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన లబ్ధిదారుల వివరాలను అప్లోడ్ చేసిన మెస్సర్స్ కోన ఇ-డేటా సొల్యూషన్స్ ఏజెన్సీకి చెల్లించాల్సిన రూ. రూ.12,38 లక్షల చెల్లింపులు.
5. శేరిలింగంపల్లి జోన్ మియర్ గురునాథ్ చెరువు ను సి.ఎస్.ఆర్ కింద అభివృద్ధి, నవీకరణ చేసేందుకు మల్లిగా వద్ సంస్థకు ఆరు నెలల కాలానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.ఓ.యు చేసుకోవడం.
6. జీహెచ్ఎంసీ కి సంబంధించిన (15) ఐటీ మాడ్యుల్స్ నిర్వహణ అగ్రిమెంట్ ను (మూడు సంవత్సరాలకు) నవంబర్ 2023 నుండి అక్టోబర్ 2026 వరకు రెన్యువల్ చేస్తూ, రూ.9,88 కోట్లకు పరిపాలన అనుమతి.
7. సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30 వరకుజీహెచ్ఎంసీ కార్పొరేటర్ లను మూడు విడతల్లో ఒక్కో విడతకు 50 మంది చొప్పున స్టడీ టూర్ కు తీసుకొని వెళ్ళుటకు ట్రావెల్ ఏజెన్సీ ల నుండి కొటేషన్లు ఆహ్వా నం.



# మానవతా వాది, నిరంతర అధ్యయన శీలి బీఎస్ రాములు

1949 ఆగస్టు 23న కరీంనగర్ జిల్లా జగిత్యాలలో ఆయన ఒక సాధారణ కార్మిక కుటుంబంలో పుట్టారు. ఆయన తల్లిదండ్రులు నారాయణ, లక్ష్మిరాజు . తండ్రి బొంబాయి బట్టలమిల్లు కార్మికునిగా పనిచేసేవారు. తన బాల్యంలోనే తండ్రి మరణించటంతో ఆయన తల్లి బీడీలు చుడుతూ వచ్చే అణా పైసలతో కుటుంబ పోషణం చేస్తుంటే తన లేతహృదయం తీవ్రంగా స్పందించేది. రజాకార్ల గురించి చదివిన రాములు, మతపరమైన విశ్వాసాలతో చెలరేగిన ఆందోళనలను ప్రత్యక్షంగా చూశారు. జగిత్యాలలోని ప్రాథమిక స్కూలులో, 1960-67మధ్య హైస్కూలు విద్య, 1970-74మధ్య ధర్మపురిలోని సంస్కృతాంధ్ర కళాశాలలో కాలేజీ ఆయన చదువుకున్నారు. తర్వాత కాకతీయ వర్సిటీ నుంచి తెలుగుపండిత శిక్షణ తీసుకున్నారు.

**తొమ్మిదో తరగతి నుంచే రచనలు చేశారు..**

చందమామ, బాలమిత్ర వంటి పత్రికల్లో రచనలు విస్తృతంగా చదివారు. బాలసాహిత్యం నుంచి ప్రేరణ పొందిన రాములు 1963-64 ప్రాంతాల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నపుడే చిన్న చిన్న రచనలు వ్రాసేవారు. పాఠశాల ప్రత్యేక సంచిక 'స్రవంతి'లో అవి అచ్చుయినవి. అయితే 1968లో 'బాలమిత్ర' జనవరి సంచికలో 'జగిత్యాల కథ' పేరుతో ఆయన తొలి రచన అచ్చుయినది. ఆ రచన ఆయనను బయటి ప్రపంచానికి రచయితగా పరిచయం చేసింది.

**నిరుపేద ప్రజల ఉద్ధరణకు పనికొచ్చే పనిచేయాలని సంకల్పించిన రాములు...**

ఆయన సాంస్కృతిక అతివాద భావజాల ఆకర్షణకు లోనై సంస్కృతీకరణను విశ్వసించారు. అందువలన ఆయన 1967 నుంచి 1972 వరకు ఆర్.ఎస్.ఎస్. ముఖ్య శిక్షక్ గా పనిచేశారు. ఆయన ఎదిగేకొద్దీ జీవితంలో లోతు పాతుల్ని, వివిధ వాదాల్ని అవగతం చేసుకొన్నారు. విప్లవవాదం, దళిత వాదం, స్త్రీ వాదం వంటి ఏ ఒక్కవాదమో కాక అన్ని వాదాల్ని అవగతం చేసుకొని అవి ప్రవచించే మానవాభ్యుదయ లక్ష్యాన్ని పట్టుకొన్నారు. ఆయన సాహిత్య సమావేశాలు, సభలు, సదస్సులు నిర్వహిస్తూ చైతన్యం కోసం కృషిచేశారు. నిరుపేద ప్రజల ఉద్ధరణకు పనికొచ్చే పనిచేయాలని సంకల్పించిన రాములు జిల్లాస్థాయిలో పౌరహక్కుల సంఘం, అంబేద్కర్ సంఘాలు, విప్లవ సంఘాలలో సభ్యత్వం పొంది ఆ దిశగా కృషి ప్రారంభించారు.

> తన రచనల ద్వారా తెలంగాణ సమాజ విశ్లేషణను చేస్తూ వస్తున్న ఆయన తెలంగాణ ఉద్యమంలో నిర్మాణాత్మక పాత్ర పోషించడమే కాకుండా, బీసీల జీవన స్థితిగతులపై వైవిధ్యభరితమైన రచనలు చేశారు. బీఎస్ రాములు గొప్ప సాహితీవేత్త, అధ్యయనశీలి, మానవతావాది, గొప్ప మనిషి. సౌశీల్యవంతులు. ముఖ్యంగా ఆయన తర్కం, విశ్లేషణ సామర్థ్యాన్ని తన గ్రంథాల్లో వెలువరించారు.



1980లో 'విరసం' లో సభ్యత్వం పొందారు. ఈ దశకమంతా ముమ్మరమైన ప్రజాజీవిత ఆచరణలో చాలా సన్నిహితుడయ్యాడు. 1983లో పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి అయ్యారు. 1984-88ల మధ్య రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యారు.అయితే ఆ కాలంలోనే ఆయన గద్దర్, వరవరరావు, సంజీవ్ తదితరులతో కలసి అఖిలభారత పర్యటనకు వెళ్లడమేకాక అజ్ఞాతవాసంలోకి వెళ్లవలసి వచ్చింది.1985-89 నిర్బంధకాలంలో, ఆ నిర్బంధాన్ని ప్రచారం చేయడానికి దేశవ్యాప్తంగా తిరిగిన బృందం సభ్యుడిగా, అజ్ఞాత కార్యకర్తగా పనిచేశాడు. 1990లో తిరిగి బహిరంగ జీవితంలోకి వచ్చారు. 1992లో ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదికను ఏర్పాటుచేశారు. దానికి వ్యవస్థాపక అధ్యక్షులయ్యారు.

**1990లో విశాల సాహిత్య అకాడమీ ప్రారంభం...**

1990లో విశాల సాహిత్య అకాడమీ ప్రారంభించారు. అకాడమీ కింద పలు సాహిత్య సభలు, సిద్ధాంత అధ్యయనాలు చేపట్టి వర్ధమాన రచయితలకు మార్గదర్శనం చేశారు. మద్యపాన, అవినీతి వ్యతిరేక ఉద్యమాలను చురుకుగా ముందుండి నిర్వహించారు. కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించారు. 2002లో సామాజిక తాత్విక విశ్వవిద్యాలయాన్ని స్థాపించి పలు పుస్తకాలు, సాహిత్యాన్ని ప్రచురించారు. 1992 నుంచి కొండా లక్ష్మణ్‌బాపూజీ జలదృశ్యంలో రచయితలు, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. 1991లో రాములు వెలువరించిన గతితర్క తత్వదర్శన భూమిక గ్రంథం తెలుగునాట భావజాల చర్చ తీరును పూర్తిగా మార్చేసింది.

1984లో అరెస్టు కావడంతో వారంపాటు లాకప్‌లో, 20రోజులు కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవించారు. రాములు పలు అవార్డులు అందుకున్నారు. కొడవటిగంటి కుటుంబరావు అవార్డు, బీడీ కార్మికులపై వెలువరించిన 'బతుకుపోరు' నవలకు పురస్కారం లభించింది. 1992లో కొండా లక్ష్మణ్‌బాపూజీ ఫౌండేషన్ పురస్కారం, 1995లో పాలకుర్తి సోమన కళాపీఠం పురస్కారం, త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కారంతోపాటు పలు అవార్డులు అందుకున్నారు.బి.ఎస్.రాములు, కథకుడిగా హేతువాదిగా పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు అందుకొన్నారు. దాశరథి రంగాచార్య పురస్కారం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం, పాల్కురికి సోమన పురస్కారం వంటి వెన్నో పొందారు. 2007లో నిజాంకాలేజీలో కేసీఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ సంబురాల్లో తెలంగాణ తల్లిని రూపొందించినందుకు స్వర్ణకంకణం ధారణంతోపాటు ఆయనకు ఘన సన్మానం జరిగింది.బిఎస్ రాములు తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. విశాల సాహితీ పురస్కారాలను ఇప్పటివరకు ఓ ముప్పై మంది కథల సంపుటాలకు ప్రదానం చేయడం విశేషం. వీరికథలు పాలు, బడి, సహజాతాలును ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.ఎ తెలుగులో పాఠ్యాంశాలుగా నిర్ణయించింది. పాలు కథ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ విద్యార్థులకి పాఠ్యాంశంగా ఉంది. 'సదువు'కథ గ్రూప్-1 సర్వీసెస్ వారికి తెలుగు పరీక్షల్లో పాఠ్యాంశమైంది.

**సామాజిక ఆర్థిక సాంఘిక సాహిత్య రంగాల్లో విస్తృతమైన అధ్యయనం..**

సామాజిక తత్వవేత్త బి. ఎస్ రాములు సామాజిక ఆర్థిక సాంఘిక సాహిత్య రంగాల్లో విస్తృతమైన అధ్యయనం చేశారు. ఆయన నిరంతర అధ్యయన శీలి. హెగెల్ డైలెక్టిక్స్ శాస్త్రాన్ని సాకల్యంగా చదివారు. దాన్ని భారతదేశానికి అన్వయించి మనదేశంలో ప్రధానమైనది కులం అని తేల్చారు. ఈయన రాసిన 'గతి తర్క తత్వ దర్శన భూమిక' గతి తార్కిక చారిత్రక భౌతిక వాద పరిశీలనలో అత్యున్నత గ్రంథాల్లో ఒకటిగా నిలిచింది. స్టాలిన్ 'గతి తార్కిక భౌతికవాదం' మీద ఒక గ్రంథం రాశారు. మావో వైరుధ్యాలు అనే గ్రంథం ప్రాతిపదికగా డైలెక్టికల్ మెటీరియలిజం మీద రాశారు. కార్న్‌ఫోర్త్ 'డైలెక్టికల్ మెటీరియలిజం' ఆధారంగా సామాజిక అంశాలను పరిశీలించి ఒక మహత్తర గ్రంథం రాశారు. అది ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి పొందింది.బిఎస్ రాములు గతి తార్కిక భౌతికవాదం, కుల సమస్య మీద రాయగలిగారు. కారణం ఏమిటంటే ఆయన బేసికల్గా ఫిలాసఫర్. జర్మన్ ఫిలాసఫర్స్ లో కాంట్, హెగెల్, కారల్ మార్క్స్ సమాజ వైరుధ్యాల మీద చాలా కృషి చేశారు. భారతదేశంలో ఇటువంటి కృషి తక్కువగా జరిగింది. నిజానికి సోక్రటీసు, ప్లేటో, అరిస్టాటిల్ ఆచార్య నాగార్జున, దిగ్నాగుడు, ధర్మకీర్తి రచనలు కూడా డైలెక్టిక్స్ తోనే నడిచాయి. భావ వైరుధ్యాలు, భౌతిక వైరుధ్యాలు, మానసిక వైరుధ్యాలు, సామాజిక వైరుధ్యాలు చర్చించడం ద్వారానే తత్వశాస్త్రం నిగ్గు తేలుతుంది. అది భారతదేశంలో ప్రధాన వైరుధ్యం కులం అని మహాత్మా జ్యోతిరావు పూలే 'గులాంగిరి'లో, అంబేద్కర్ 'కుల నిర్మూలన' గ్రంథంలో చెప్పారు. దాన్ని భారతీయ కమ్యునిస్టు సిద్ధాంత కర్తలు నిర్లక్ష్యం చేశారు.

**'గతి తర్క తత్వ దర్శన భూమిక'పై అంబేద్కర్ 'కుల నిర్మూలన' గ్రంథ ప్రభావం**

బి. ఎస్. రాములు 'గతి తర్క తత్వ దర్శన భూమిక'పై అంబేద్కర్ 'కుల నిర్మూలన' గ్రంథ ప్రభావం ఉంది. ఈయన కొండపల్లి సీతారామయ్య గ్రూపులో తాత్విక భావజాల నిర్మాణంలో ప్రధానంగా పాల్గొన్నారు. కేజీ సత్యమూర్తి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, తరిమెల నాగిరెడ్డి వీళ్లంతా కూడా నక్సల్ బరి ఉద్యమ ప్రతినిధులుగా భారతదేశంలో సాయుధ పోరాటం గూర్చి చాలా చర్చలు సాగించారు. కానీ ఈ చర్చల్లో ఎక్కడ కూడా పూలే, అంబేద్కర్ ప్రస్తావన రాకపోవడం ఆశ్చర్యమే. వీరందరూ కూడా చారుమజుందార్, కానూ సన్యాల్, రణధివే భావజాలాలకే పరిమితమయ్యారు. బి ఎస్ రాములు నక్సల్బరీ ఉద్యమం నుండి బయటకు వచ్చాక లోతుగా అధ్యయనం చేసి ప్రధాన వైరుధ్యం కులం అని తేల్చారు. అది చాలా కొత్త పరిణామానికి దారి తీసింది. నేడు వారి 76వ జన్మదినం సందర్భంగా వారికి విశ్వంభర శుభాభినందనలు తెలుపుతోంది.

## బీఎస్ రాములు సాహితీ ప్రస్థానం..

1975లో సాంఘికసంక్షేమశాఖలో ఉద్యోగం ప్రారంభించి 2007లో పదవీవిరమణ చేశారు. 1970-77 నుంచి ఉద్యోగసంఘాల నిర్మాణంతోపాటు పీడీఎస్ యూ, ఆర్ఎస్యూ, విద్యార్థియువజన సంఘాల నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. పలు సైద్ధాంతిక వ్యాసాలు, పుస్తకాలు రాశారు. తెలంగాణ రచయితలు, కళాకారులు మేధావుల ఐక్యవేదిక కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కథకుడిగా ఆయన తెలంగాణా ప్రజల దీనస్థితిని అక్షరీకరించారు. కాలువ మల్లయ్య రాములు కథల్ని మూడు భాగాలుగా వర్గీకరించారు. విప్లవ సాహిత్య అవగాహనలో భాగంగా 1990 దాకా రాసిన కథలు, తాత్విక సైద్ధాంతిక గ్రంథాలు రాసిన గాఢతతో రాసిన దళిత, బహుజన స్త్రీవాద కథలు.సామాజిక, ఆర్థిక, రాజకీయ, చారిత్రక, మానవ సంబంధాల కథలు.రాములు 175 కి పైగా కథలు రాశారు. ఆరు నవలలు, నూటయాభై సిద్ధాంత వ్యాసాలు, అన్నీ సాహిత్య వ్యాసాలు, పది తాత్విక గ్రంథాలు రాశారు. పాలు, చదువు, స్మృతి, మమతలూ- మానవ సంబంధాలు, వేపచెట్టు వంటి కథల సంపుటాలు, బతుకు పోరు వంటి నవలలు ఆయనకి బాగా పేరుతెచ్చాయి. జ్ఞానం పుట్టుక, బీసీలు ఏంచేయాలి, నెనెవరు గతి తర్క తత్వ దర్శన భూమిక, బహుజన తత్వం, ప్రేమంటే ఏమిటి?, భౌతిక వాద ప్రాపంచిక దృక్పథం, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి యువజనులారా వంటి తాత్విక గ్రంథాలు, సమగ్ర సామాజిక కథ, కథలబడి - కథా సాహిత్య అలంకార శాస్త్రం వంటి రచనలు చేశారు. ఇంకా ఉద్యమకథలు, తెలంగాణా వ్యాసాలు, కన్యాశుల్కాన్ని ఎలాచూడాలి, సాహిత్య చరిత్రను కొత్తచూపుతో ఎలా తిరగరాయాలి? సాహిత్య చరిత్రను కొత్త చూపుతో ఎలా తిరగరాయాలి? పాట పుట్టుక, దళిత సాహిత్య చరిత్రను ఎలా అధ్యయనం చేయాలి, సాహిత్యంలో సమాజ అన్వేషణ వంటి గ్రంథాలెన్నో రాశారు.



-పి.వెంకటరమణ గుప్త,
న్యూస్ నెట్వర్క్ (విశ్వంభర)
సెల్: 9550839444

# దేశసేవలో ఉదాత్తుడు ప్రకాశం పంతులు

## నేడు ఆయన జయంతి

> తెల్లదొరలను దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రాణాలకు తెగించి, సర్వం త్యజించి పోరాడిన భరతమాత ముద్దుబిడ్డలెందరో...! అలాంటి సంగ్రామ యోధులలో ముఖ్యుడు, తెగువ చూపిన తెలుగువాడు టంగుటూరి ప్రకాశం. బ్రిటిష్ వాళ్ల హుంకరింపులకు ఏనాడు ఆయన అదరలేదు. తుపాకీలకు బెదరలేదు. భారతావని బానిస సంకెళ్లు తెంచేదాకా పట్టువిడవలేదు. అందుకే ప్రకాశం పేరు చెబితేనే తెలుగుజాతి గుండెల్లో గర్వం ఉప్పొంగుతుంది. నరనరానా నెత్తురు ఉరకలేత్తుతుంది..! న్యాయకోవిదుడు, రాజకీయ ఉద్దండుడు, దేశసేవలో ఉదాత్తుడుగా మన్ననలు అందుకున్న మహనీయుడు 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు. నేడు 153వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

టంగుటూరి ప్రకాశం పంతులు సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన కృషీవలుడు. 1940-50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారు.

టంగుటూరి ప్రకాశం 1872 ఆగష్టు 23 న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోద రాయుని పాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారు. పదకొండో యేట తండ్రి మరణించడంతో, పిల్లలను తీసుకుని తల్లి ఒంగోలు చేరింది. ఒంగోలులో ఆమె భోజనశాల నడప వలసి వచ్చింది. ఆ రోజుల్లో ఇలాంటి వృత్తి చేసే వారిని సమాజంలో చాలా తేలికగా చూసేవారు. పూటకూళ్ళ వ్యాపారం చేసే తల్లి సంపాదన చాలక, ప్రకాశం ధనికుల ఇళ్ళల్లో వారాలకు కుదిరారు. పిన్న వయసులోనే ప్రకాశం నాటకాలు వేసేవారు. వల్లూరులో ప్రకాశం ప్రాథమిక విద్య సాగింది. అల్లరి చిల్లరి సావాసాల వల్లా, నాటకాల వ్యాపకం వల్లా, ప్రకాశానికి మెట్రిక్ పాస్ అవడం కష్టమయ్యింది. మిషను పాఠశాల ఉపాధ్యాయుడైన ఇమ్మానేని హనుమంతరావు నాయుడు చలవతో ప్రకాశం ఫీజు లేకుండా ప్రీ మెట్రిక్ లో చదివారు. నాయుడు రాజమండ్రికి నివాసం మారుస్తూ, ప్రకాశాన్ని తనతో తీసుకువెళ్ళి, అక్కడ ఎఫ్.ఏ.లో చేర్పించారు. తరువాత మద్రాసుకు పంపించి, న్యాయశాస్త్రం చదివించారు. ప్రకాశం 1890లో తన అక్క కూతురైన హనుమాయమ్మను పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాత కొద్దికాలం పాటు ఒంగోలులో న్యాయవాద వృత్తి చేసి, 1894లో మళ్ళీ రాజమండ్రి చేరారు. వృత్తిలో పేరూ, పుష్కలంగా సంపద సంపాదించారు. తన 35వ ఏట రాజమండ్రి పురపాలక సంఘానికి అధ్యక్షుడయ్యారు.

అప్పట్లో ప్రకాశం సెకండ్ గ్రేడ్ ప్లీడరు. కనుక పై స్థాయి కోర్టులలో వాదించడానికి అర్హత లేదు. బారిస్టరులకు మాత్రమే ఆ అర్హత ఉండేది. ఒకసారి ప్రకాశం ప్రతిభ గమనించిన ఒక బారిస్టరు ప్రకాశాన్ని కూడా బారిస్టరు అవమని ప్రోత్సహించారు. ఆ సలహా నచ్చి, ప్రకాశం 1904లో సాంప్రదాయాలను పక్కనపెట్టి, ఇంగ్లాండు వెళ్ళారు. వెళ్ళే ముందు మహాత్మా గాంధీ లాగానే మద్యం, మాంసం, పొగాకు ముట్టనని తల్లికి మాట ఇచ్చి ఒప్పించారు. దీక్షగా చదివి బారిస్టరు అయ్యారు. ప్రకాశం మద్రాసు హైకోర్టులో ప్రాక్టీసు ప్రారంభించారు. అప్పట్లో మద్రాసులో ప్రసిద్ధి చెందిన బారిష్టరులందరూ ఆంగ్లేయులు లేదా తమిళులు. పేరుపొందిన తెలుగు బారిష్టరులలో ఈయనే ప్రప్రథముడు.



ప్రకాశం జాతీయోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అప్పటికి ఇంకా భారత రాజకీయ రంగంలో గాంధీజీ ప్రవేశించనే లేదు. ప్రకాశం సత్యాగ్రహోద్యమంలో ముమ్మరంగా పాల్గొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లారు. గాంధీజీని సైతం లెక్క చేయని ఆంధ్ర నాయకులలో మొదటి వారు ప్రకాశం.1908లో ప్రముఖ జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ మద్రాసుకు వచ్చారు. ఆయన సభకు అధ్యక్షత వహించుటకు ప్రముఖులు భయ పడ్డారు. పిడుగులు కురిసినట్లు, వడగండ్ల వానలా చేసిన, బిపిన్ పాల్ గంభీరోపన్యాసం మద్రాసు ప్రజల్లో నూతన చైతన్యం కల్గించింది. ఆనాటి నుండి ప్రకాశం తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. జాతీయ భావాలను ప్రచారం చేయటానికి మద్రాసులో 'స్వరాజ్య' పత్రికను 1921 అక్టోబర్ 29న దినపత్రికగా ప్రారంభించారు. ఖాసా సుబ్బారావు, కోటంరాజు పున్నయ్య, జి.వి. కృపానిధి మున్నగు గొప్ప పాత్రికేయులు 'స్వరాజ్య' లో పని చేశారు."స్వరాజ్య" పన్నెండేళ్ళు నడిచింది. లక్షల్లో అప్పులు చేశారు ప్రకాశం. తన బంగళాలను అమ్మి అప్పులు తీర్చారు. ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించే వారాయన. "గాలితో నైనా పోట్లాడే స్వభావం కలవాడు ప్రకాశం"అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావు. 1929లో సైమన్ కమీషన్ మద్రాసుకు వచ్చింది. మద్రాసులో అతనిని బహిష్కరించటం వద్దన్నారు గాంధీజీ. గాంధీగారి ఆదేశం ప్రకాశంగారికి నచ్చలేదు. రాజాజీ తప్పుకున్నారు. ప్రకాశం పంతులు, దుర్గాబాయ్, రంగయ్య నాయుడు, వేలాది ప్రజలతో వూరేగింపు వెళ్తూ 'సైమన్ గోబ్యాక్' అని గర్జించారు. బ్రిటీష్ తొత్తులైన సైనికులు తుపాకులతో కాలుస్తాం అని కేకలు వేశారు. ఒక అజ్ఞాత దేశభక్తుడు తుపాకి గుళ్లకు బలి అయ్యాడన్న వార్త దావానలంలా వ్యాపించింది. ప్రకాశం సింహంలా ముందు కురికారు. చొక్కా గుండీలు విప్పి"రండిరా యిదె కాల్చు కొండిరా"అని గుండె చూపిన వేళ... తుపాకులు తలలు వంచాయి. అంతటితో ప్రకాశం పేరు దేశమంతటా మార్మోగింది.

1937లో కాంగ్రెసు అధికారం లోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రి వర్గంలో ఆయన రెవిన్యూ మంత్రిగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.1945లో జైలు నుండి విడుదలైన తర్వాత రాష్ట్రమంతటా పర్యటించారు.

1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగారు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. స్వంత పార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించారు.

సామాన్య ప్రజల సంక్షేమార్థమై ప్రకాశం, తన వ్యక్తిగత భద్రతను, జవహర్ లాల్ నెహ్రూ చేసిన హెచ్చరికలనూ, లెక్కచేయకుండా 1948లో నిజాం పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రాన్ని సందర్శించారు. నిజాం సహాయ సహకారాలతో సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రజాకార్ల నాయకుడు ఖాసిం రిజ్వీని కలిసి, రిజ్వీ తన అదృష్టాన్ని చాలా దూరం లాగుతున్నాడని హెచ్చరిక చేశారు. ప్రకాశం ధైర్యానికి మెచ్చుకోలుగా రజాకార్లు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు.

1953 అక్టోబర్ 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు దానికి తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం నియమితులు అయినారు. రాష్ట్రావతరణ మొదటి వార్షికోత్సవ సమయంలో 2000 మంది ఖైదీలకు క్షమాభిక్ష, తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణా నదిపై బారేజి నిర్మాణం వీటిలో ప్రముఖమైనవి. ప్రకాశం లక్షలార్జించినా, చివరికి ఏమీ దాచుకోలేదు. చరమ దశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశంకు నెలకు రు.750/- గౌరవభృతి సొంత వాడకానికి ఒక కారు ఇచ్చింది. దానిలో పెట్రోల్ పోయించు కోలేని దయనీయ స్థితి ఆయనది.ఆంధ్రజాతికి తిరుగులేని నాయకుడుగా వెలిగిన ప్రకాశం తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొంది, 1957 మే నెల 20వ తేదీన దివంగతులయ్యారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ



**విశ్వంభర, హైద్రాబాద్:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకఅధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కలిశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రికి నీ కోరడం జరిగిందని తెలిపారు.మందకృష్ణతో పాటు ముఖ్యమంత్రిని కలిసిన మంత్రి దామోదర రాజనరసింహ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు,మాజీ ఎంపీ పసునూరి దయాకర్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ పార్టీ రణం



**విశ్వంభర. భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ, చిట్యాల మండల కేంద్రాలల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామరావు పిలుపు మేరకు రైతుల పక్షాన ధర్నా నిర్వహించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ ఋణ మాఫి చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ తక్షణమే రూ.2,00,000లు రుణ మాఫీ వెంటనే చేయాలని లేని పక్షంలో ఈ ధర్నా కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేసి రైతులకు న్యాయం చేకూరేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రైతు ధర్నాలోపాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**విశ్వంభర, కోరుట్ల:** రైతులపై వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనగా కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా దగ్గర రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డా కల్వకుంట్ల సంజయ్. రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి తరపున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమలు నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ ప్రయోజనం పొందకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు రైతులందరికి రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను ఆయోమయానికి, ఆవేదన గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు నియోజకవర్గనికి చెందిన మండల అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# డబ్బుల కోసం..చేరదీసిన తల్లినే కడతేర్చిన పెంపుడు కొడుకు





**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** ఐదుగురు ఆడపిల్లలు పుట్టిన అనంతరం మగ సంతానం కోసం చేరదీసి పెంచుకుంటున్న ఆ పెంపుడు కొడుకే కాలేయముడిగా మారాడు గంజాయికి బానిసై ఆ మత్తులో డబ్బు కోసం పెంపుడు తల్లిని కడ తెర్చిన సంఘటన కుత్బుల్లాపూర్ గ్రామం హరిజన బస్తీలో బుధవారం చోటుచేసుకుంది. కుత్బుల్లాపూర్ డివిజన్ జలమండలి పారిశుద్ధ కార్మికుడిగా పని చేస్తున్న పెద్ద స్వామి భార్య పెద్ద జయమ్మ (64) దంపతులకు 5గురు ఆడ పిల్లలు ఉన్నారు. మూడు నెలల వేణు (నిందితుడు 34) ని పెంచి పోషించి వివాహం కూడా చేశారు. తెచ్చుకొని పోషించిన నాలుగు సంవత్సరాల తర్వాత స్వామి జయమ్మ లకు వినోద్ 24 జన్మించాడు. గంజాయికి బానిసై డబ్బు కోసం నిందితుడు వేణు పని పాట లేకుండా జులాయిగా తిరుగుతూ గంజాయికి బానిసై నిత్యం భార్యతో గొడవపడేవాడు అతని ప్రవర్తన భరించలేక 8 నెలల క్రితం తన పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్ళింది. అయినా తీరు మార్చుకోలేక నిత్యం తాగివచ్చి తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన సెల్ ఫోన్ తాకట్టు పెట్టి మత్తులో తల్లిని విచక్షణ రహితంగా కొట్టి పదునైన పరికరంతో పొడిచి కడతేర్చినట్టు స్థానికుల ద్వారా తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్ కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలది తప్పుడు ప్రచారం

**విశ్వంభర, భూపాలపల్లి:**

రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారం సరికాదని, 8 నెలల ప్రజాపాలనలో ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ దొంగ ధర్నాలు, దీక్షలు, రాస్తారోకోలు చేస్తుందని, ప్రజలెవరూ మిమ్మల్ని నమ్మే పరిస్థితిలో లేరని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈరోజు గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దేవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం తగదని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన రైతులకు తప్పకుండా రుణమాఫీ చేస్తామని చెప్పారు. పదేళ్లలో ఏనాడూ రైతుల గురించి మాట్లాడని కేటీఆర్ కు రైతు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదని, ధర్నాలు, రాస్తారోకోలు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయలేనివారు అధికారం కోల్పోయిన తర్వాత రైతులను ఆందోళనకు గురిచేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలల్లో ప్రజలు బీఆర్ఎస్ కు గుండు సున్నా వేశారని, ఇప్పుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలల్లో డబుల్ సున్నాలు వేస్తారని ఎద్దేవా చేశారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షణ రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి మొత్తం మూడు విడతలతో ప్రభుత్వం రుణమాఫీ చేసిందని తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని, అటువంటి రైతుల నుండి ఫిర్యాదు తీసుకుని క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. త్వరలోనే రైతులందరికీ కూడా రుణమాఫీపై ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఉన్నారు.



# అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలి

**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పూర్తిగా రుణమాఫీ కానందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ గవర్నమెంట్ రెండు లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని సీ.ఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అందుకు నిరసనగా మండల బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డిసెంబర్ 9న రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ ఇస్తానని హామీ ఇచ్చి గెలిచిన తర్వాత మూడు దాపాలుగా రుణమాఫీ చేసినప్పటికీ ఇంకా రెండు లక్షల రుణమాఫీ కానీ రైతులు చాలామంది ఉన్నారని, మిగతా రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, మాజీ జడ్పీటీసీ నర్సింహ, మాజీ జడ్పీ కో ఆప్షన్ మూజీబూర్ రహేమాన్,



మాజీ సర్పంచ్ లు గోపాల్ నాయక్, జ్యోతయ్య, ఈశ్వర్ నాయక్, రాములు, శంకర్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్, యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

# కండిషన్లు కోతలు కొర్రీలు లేకుండా వెంటనే రుణమాఫీ చేయాలి



**విశ్వంభర, మహేశ్వరం:**

కండిషన్లు, కోతలు, కొర్రీలు లేకుండా వెంటనే రూ 2 లక్షల రుణమాఫీ చేయాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు అరవింద్ శర్మ ఆధ్వర్యంలో మహేశ్వరం లో ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ రాజశేఖర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 వేల కోట్లు రుణమాఫీ చేస్తానని చెప్పి 7,500 కోట్లు చేసి రైతులను నిండా ముంచారని అన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలోకి వెళ్లిన పదిమంది కంటే ఎక్కువ రుణమాఫీ కాలేదని, మిగతా రైతులకు ఎప్పుడు రుణమాఫీ చేస్తారో చెప్పాలన్నారు. రైతుబంధు నిధులే రుణమాఫీకి కేటాయించి రుణమాఫీ అంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెప్పి రాజకీయం చేస్తుందన్నారు. ప్రతిరోజు రైతులు వ్యవసాయాన్ని పక్కకు పెట్టి బ్యాంకుల, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డికి పరిపాలన చేతకాకుంటే ఏ భట్టి విక్రమార్కకో, ఉత్తమ్ కుమార్ రెడ్డి కో, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలో ఇచ్చి వెంటనే తప్పుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజు నాయక్, లక్ష్మి నర్సింహా రెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, గొడుగు శ్రీనివాస్, కంచర్ల శేఖర్, చిన్నం రమేష్ కురుమ, లక్ష్మీ నరసింహ రెడ్డి, కర్రోళ చంద్రయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, ఆనంద్, నవీన్ రవి జగన్ నాయక్ పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన

**విశ్వంభర, ఆమనగల్లు:** కట్ట మైసమ్మ దేవాలయంలో రెండవ రోజు శ్రీ నారామణి ప్రత్యాంగిరా మహాదేవి దివ్యశాంతి (సుగంధ ద్రవ్యములు, ఎండు మిరుపకాయలు) మహాయజ్ఞ పీఠ స్థాపన కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కండే హరిప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కట్ట మైసమ్మ అమ్మవారి యంత్ర ప్రతిష్ట, అమ్మవారి దివ్యస్వరూప సద్గురు శాంకరీ అగోరి మాత మహాగాయత్రిదేవి ఉపసకురాలు నారాయణీ ప్రత్యాంగిరా మాతాజీ కరకమలములచే ప్రతిష్ట జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజు సంఘం అధ్యక్షులు మోక్తల వెంకటయ్య, అంజయ్య, ఎర్రవోలు మహేష్, కేకే శీను, ఎర్రవోలు రాజు, ముక్కెరి యాదయ్య, బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# ఆవేదనలో రుణమాఫీ కాని రైతన్నలు

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం గురువారం రైతు వేదికల వద్ద రుణమాఫీ కానీ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల కిచ్చిన వాగ్దానంలో అందరికి రెండులక్షల ఋణమాపీ అనటంతో బ్యాంక్ లో అప్పు తీసుకున్న ప్రతి అన్నదాత ఆనందపడ్డారు. రుణమాపీకి కొర్రీలు, రేషన్ కార్డు లేదని, కుటుంబంలో ఒక్కరికే అని, కొత్త షరతులు పెడుతూ బ్యాంక్ లోన్ తీసుకున్న రైతులను ప్రభుత్వం తిప్పలు పెడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పట్టాదారు పాస్ పుస్తకంతో లోన్ ఉన్న ప్రతి రైతుకు ఋణ మాపి చేయలని రైతులు కోరారు.

# గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య గుండెపోటుతో బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. సాయంత్రం విధుల్లో నిర్వహిస్తుండగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటుతో ఇబ్బందిపడడంతో సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐలు వెంకటేష్, వరప్రసాద్, శ్రీకాంత్ తమసానుభూతిని తెలియజేశారు.



# సురవరం సుధాకర్ రెడ్డిని కలిసిన మంద కృష్ణ మాదిగ



**విశ్వంభర, హైద్రాబాద్ :** సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డిని మంద కృష్ణ మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమం విజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మొదటి నుండి మద్దతుగా ఉన్న సీపీఐ పార్టీ నేత సురవరం సుధాకర్ రెడ్డిని హైదరాబాద్ లోని తన నివాసంలో కలిసి మంద కృష్ణ మాదిగ కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగను సురవరం సుధాకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# స్పృహ తప్పిన వృద్ధురాలు.. ఆస్పత్రిలో చేర్చిన జర్నలిస్టు



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన బండి లక్ష్మి అనారోగ్యంతో భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి వచ్చింది. సమీకృత కలెక్టరేట్ వద్ద బస్సు దిగి ఓపికలేక స్పృహ తప్పి పడిపోయింది.గంటకు పైగా అక్కడే పడి వున్నా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న సిబ్బంది ఎవరు పట్టించుకోకపోవడంతో అటుగా వెళుతున్న జర్నలిస్ట్ ఎడ్ల సంతోష్ ఆమెను గమనించి వెంటనే అంబులెన్స్ కు సమాచారం అందించి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.అటుగా వెళుతున్న ప్రజలు శభాష్ జర్నలిస్ట్ అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

# రుణమాఫీ పేరుతో లక్షలాది రైతుల్ని వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వం: హరీష్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** రుణమాఫీ పేరుతో లక్షలాది రైతుల్ని వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. ఈ కష్టకాలంలో అన్నదాతలకు అండగా ఉండి సంపూర్ణ రుణమాఫీ కోసం వారి పక్షాన కొట్లాడాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'రైతు రణం' పేరుతో రాష్ట్రవ్యాప్త ధర్నాలకు పిలుపునిచారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఈధర్నాలో పాల్గొన్నారు. ధర్నాలో ఆత్మకూరు(ఎం)మండల పార్టీ బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు కూరెళ్ల, మాజీ సర్పంచ్ బాపబోయిన ఉప్పలయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ కొమ్ము నరేష్, జిట నాగరాజు, క



# వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తిచేయాలి

**- కలెక్టర్ రాహుల్ శర్మ**

**విశ్వంభర, భూపాలపల్లి:**

రానున్న వారం రోజుల్లో వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో వన మహోత్సవంపై అటవీ, డీఆర్డీఏ, ఉద్యాన, వ్యవసాయ, పోలీస్, ఎక్సైజ్, సింగరేణి శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 26 లక్షల 130 మొక్కలు నాటాలని లక్ష్యం కేటాయించగా ఇప్పటి వరకు 21 లక్షల 721 మొక్కలు నాటారని, మిగిలిన లక్ష్యాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో ప్రతి ఇంటికి 6 మొక్కలు నాటేందుకు పంపిణీ చేయాలని, మొక్కలు పంపిణీ వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. మున్సిపాలిటికి 1.60 లక్షల

మొక్కలు నాటడం లక్ష్యం కేటాయించగా ఇప్పటి వరకు 45840 మాత్రమే నాటారని ఎందుకు పూర్తి చేయలేక పోతున్నారని మున్సిపల్ కమిషనర్ ను ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శనివారం



మాస్ ప్లాంటింగ్ చేపట్టాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. డివైడర్లలో కోనో కార్పస్ మొక్కలు తొలగిస్తున్నామని, వాటి స్థానంలో మొక్కలు నాటాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. సింగరేణి, బీటీపీపీ పారిశ్రామిక వాడల్లో మొక్కలు నాటి, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. సింగరేణి గనుల వద్దకు వెళ్ళే రహదారుల్లో ఇరువైపులా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. వనమహోత్సవంలో వెనుకంజలోఉన్నామని, వారంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. నాటిన ప్రతి మొక్క లెక్క పక్కాగా ఉండేందుకు జియా ట్యాగింగ్ చేయాలని, అటవీ పోర్టల్ లో అప్ చేయాలని ఆదేశించారు. హరితనిధి ద్వారా చనిపోయిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యం మేర మొక్కలు నాటలేదని, నాటేందుకు ఇతర శాఖలకు మొక్కలు ఇవ్వడం లేదని, మున్సిపాలిటికి 50 వేల మొక్కలు ఇవ్వాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ చెరువులు, కాలువల్లో ఈత మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అటవీ అధికారి వసంత, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ నరేష్, జడ్పీ సీఈఓ విజయలక్ష్మి, ఉద్యాన అధికారి సంజీవరావు, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, డీఎస్పీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యాబై లీటర్ల బెల్లం పానకం ధ్వంసం, ఇద్దరు అరెస్టు



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ బైద్యనాథ్ చౌహన్ ఆధ్వర్యంలో ఆమనగల్లు పరిధిలోని నాలుగు మండలాలలో నాటు సారా స్థావరాల పై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదు లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఆరుగురిని ఎమ్మార్వో వద్ద బైండోవర్ చేసి కోటయ్య, బీచ్య ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ బైద్యనాథ్ చౌహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువతను మత్తుకు బానిసలవ్వకుండా డ్రగ్స్ రహిత తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ యొక్క ఆదేశాలు పాటించి అన్ని మండల హెడ్ క్వార్టర్స్ నిషేధిత ప్రాంతాలు, చాలా కాలం నాటి వెంచర్లలో మఫ్టీలో సోదాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫామ్ హౌస్, ఫంక్షన్ హాల్, రిసార్ట్స్ పర్మిషన్ లేకుండా

మద్యం అనుమతిస్తే ఫంక్షన్ హాల్ ఓనర్ పైన ఈవెంట్ నిర్వాహకుల పైన, చట్ట రీత్య చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా గంజాయి, బెల్లము, పట్టిక, విపప్వు సేవించడం ఎవరైనా చూస్తే ఆమనగల్లు ఎక్సైజ్ స్టేషన్ వారికి తెలియజేయాలని డిపార్ట్మెంట్ నుంచి తగిన పారితోషకం ఇచ్చి వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎక్సైజ్ సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై స్వప్న, హెడ్ కానిస్టేబుల్ శంకర్, లోక్య, దశరథ్, శ్రీజ, శ్రీను, ప్రవీణ్, రామ్ రెడ్డి, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## పట్టా పాస్ బుక్ కలిగిన రైతులందరికీ రుణమాఫీ చేయాలి



**విశ్వంభర, కడ్తాల్:** బీఆర్ఎస్ పార్టీ కడ్తాల్ మండల అధ్యక్షులు కంబాల పరమేష్ ఆధ్వర్యంలో పట్టా పాస్ బుక్ కలిగిన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ అందించాలని కడ్తాల్ మండల కేంద్రంలో తాహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ వినోద్ కుమార్ కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు గోపాల్, మంజుల చంద్రమౌళి, ప్రియా రమేష్, మాజీ సర్పంచ్లు సులోచన సాయిలు, హరిచంద్, దేవా, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, మంగళపల్లి నరసింహ, లాయక్ అలీ, పాండు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సమావేశాలకు ఆహ్వానం



**విశ్వంభర, రామన్నపేట:** ఈనెల 23న ఢిల్లీలో బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సమావేశాలకు రామన్నపేట పట్టణం నుండి ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగులయ్యకి ఆహ్వానం రావడం పట్ల బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రామన్నపేట పట్టణం నుండి మొట్ట మొదటిసారిగా జాతీయ కార్యవర్గ సమావేశానికి రామన్నపేటకు చెందిన తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ జాతీయ నాయకులకు, రాష్ట్ర నాయకులకు నకిరెకంటి మొగులయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.



## బోనాల ఉత్సవాలను ప్రారంభించిన మాజీ సర్పంచ్

**విశ్వంభర, రామన్నపేట:**

రామన్నపేట మండల కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మాజీ సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్ బోనంకు వేప ఆకులు, పసుపు, కుంకుమలతో అలంకరించి డప్పులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ముత్యాలమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించి బోనాల ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామన్నపేట పట్టణ ప్రజలను ఆర్థికంగా, సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉంచాలని ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లాల్ బహుదూర్, మాజీ సర్పంచ్ ఆకవరపు మధుబాబు, మాజీ ఎంపీటీసీ సాల్వేర్ అశోక్, మాజీ ఎంపీటీసీ ఉటుకూరి శోభ నర్సింహా, పంచాయతీ కార్యదర్శి కధీర్, పట్టణ ప్రముఖులు గోదాసు సుగ్రీవులు, జెల్ల వెంకటేశం, బందెల రాములు, రామిని రమేష్, భైరబోయిన రమేష్, కోట సుధాకర్, వీరమల్ల వెంకటయ్య, వనం బిక్షం, లవణం ఉపేందర్, నిఖిల్ స్వామి, గంగపురం వెంకటయ్య, భూపతి నర్సింహా, కందుల హనుమంత్, గర్క సత్యనారాయణ, మోతే లక్ష్మణ్, ఇతపుల రాజు, మోతే రమేష్, సిందం లింగం, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## అంటువ్యాధుల నియంత్రణ చర్యలపై సమావేశం




**విశ్వంభర, భూపాలపల్లి:** వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరీక్షలు పెంచాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యాధికారులను ఆదేశించారు. అంటువ్యాధులు నియంత్రణ చర్యలపై గురువారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు 27 కేసులు నమోదు అయ్యాయని, మళ్ళీ అదే నెలల్లో వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలతో వైద్యాధికారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి రోజు వ్యాధులు నమోదుపై నివేదికలు అందచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. రానున్న రోజులు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర స్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉందని సమయ పాలన పాటించాలని స్పష్టం చేశారు. పంచాయతీ, మున్సిపల్ ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలున్న ప్రాంతాలను గుర్తించి దోమలు వ్యాప్తి జరుగకుండా టెమో పాస్ మందు స్ప్రే చేయాలని తెలిపారు. ఎలీసా పరీక్ష తదుపరి మాత్రమే డెంగీ వ్యాధి నిర్ధారణ చేయాలని అన్నారు. తక్షణమే ప్రాథమిక, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ర్యాపిడ్ పరీక్షలు నిర్వహించాలని, అనుమానిత కేసులకు ఎలీసా పరీక్షలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 47 ప్రైవేట్ ఆసుపత్రులున్నాయని, వైద్య పరీక్షలు తనిఖీ చేయాలని ఆదేశించారు. అనవసరపు పరీక్షలు నిర్వహిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 225 అనుమానిత కేసులకు పరీక్షలు నిర్వహించామని వాటిలో 9 డెంగీ, 2 మలేరియా కేసులు గుర్తించినట్లు తెలిపారు. ప్రాథమిక దశలో వ్యాధి గుర్తించడం వల్ల తక్షణమే వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని తద్వారా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డెంగీ నమోదు జరిగిన ప్రాంతాల్లో సమీపంలోని 50 ఇళ్ల వరకు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మంగళ, శుక్రవారాల్లో క్రమం తప్పక డ్రై డే కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని, పరిసరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరగాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు ఆహ్లాదకరమైన మొక్కలు నాటాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, ఉప జిల్లా వైద్యాధికారి డా కొమురయ్య, డా శ్రీదేవి, డా రవి రాథోడ్, ఉమాదేవి, ప్రమోద్, ప్రొగ్రామ్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** బీఅర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు భూపాలపల్లి మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి పిలుపుమేరకు రైతు రుణమాఫీపై కాంగ్రెస్ చేసిన మోసానికి బీఆర్ఎస్ రణం ధర్నా కార్యక్రమంలో మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రైతులకు మద్దతుగా మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, సర్పంచ్ ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు చదువు అన్నా రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి 2 లక్షల రుణ మాఫీ చేస్తామని సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేని అసమర్ధ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రైతుల పక్షాన ధర్నాలు నిర్వహించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులకు వెంటనే రెండు లక్షలు రుణమాఫీ చేయాలని బీఅర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. రైతు బాంధవుడు కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు ఎటువంటి కష్టం రాలేదు, ఈ ఎనిమిది నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక కష్టాలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో బీఅర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దానబోయిన రాములు, నైనకంటి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పిన్నింటి వెంకట్రావు, బైరగోని లావయ్య, నేర్పడి శ్రీనివాస్, గంట రవీందర్ రెడ్డి, ముడుపు రవీందర్, దేవుని కుమార్, గొల్లపల్లి తిరుపతి, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ విద్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా గణపురంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ విద్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, వంట సామాన్లు భద్రపరిచే గది, విద్యార్థుల డార్మెటరీ, విద్యార్థులకు భోజన సౌకర్యం, క్లాస్ రూమ్స్ పరిశీలించారు. 6వ తరగతి విద్యార్థి మహంతి స్వస్త్య తో లెక్కలు చేయించి బాగా చేశావని అభినందించి భవిష్యత్తులో ఏం అవుతావని అడిగారు. తాను డాక్టర్ కావాలని అనుకుంటున్నానని విద్యార్థిని చెప్పింది. విద్యార్థులు చిన్నతనం నుండే లక్ష్యాన్ని నిర్దేశించుకుని బాగా చదువుకోవాలని సూచించారు. వసతి గృహం నిర్వహణ బాగుందని ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకుని మరమ్మత్తులు నిర్వహణకు ఇంజనీరింగ్ అధికారుల ద్వారా పర్యవేక్షణ చేయించి అంచనా, ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కిచెన్ ఫ్లోరింగ్, మంచినీటి ట్యాంక్, ఆర్వో ప్లాంట్, ప్రహరీ, కంప్యూటర్ లాబ్, అదనపు తరగతి గదులు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రిన్సిపల్ చేసిన విజ్ఞప్తిని పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. క్రమం తప్పక విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ వంటలు ఎలా ఉన్నాయంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి వసతిగృహ సందర్శన రిజిస్టర్ లో సంతకం చేశారు. విద్యార్థులతో కలిసి విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులు, సిబ్బంది ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరేష్, తహసిల్దార్ మురళీధర్ రావు, ఎంపీడీవో భాస్కర్, ప్రిన్సిపల్ స్వప్న పాల్గొన్నారు.

## నాటుదాం.. ఒక చెట్టు అమ్మ పేరు మీద

**ఎంపీడీఓ రాములు నాయక్**



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా సర్వపల్లి గ్రామపంచాయతీలో మొక్కలు నాటి ఎంపీడీఓ రాములు నాయక్ ప్రారంభించారు. తుక్కాపురం గ్రామంలో ఎంపీఓ జులూరు పద్మావతి, ఏపీఓ బోడిగే రమేష్ గౌడ్, ఈసీ సుంకరి శ్రీనివాస్ గౌడ్, ఆయాగ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, ఏఫ్ఏలు, అంగన్వాడీ టీచర్లు, వీబీకేలు, ఆశాకార్యకర్తలు, గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రూ.50 లక్షలతో ఎదులాబాద్ పాఠశాల నూతన భవన నిర్మాణం



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల్ ఎదులాబాద్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షల నిధులతో నూతన భవనాన్ని నిర్మించనున్నారు. గురువారం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డితో కలిసి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పాఠశాలల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నారు.

## షాపూర్ నగర్‌లో వ్యక్తి ఆత్మహత్య



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** హెచ్ఎంటి సబ్ స్టేషన్ వెనకాల చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చంద్రశేఖర్ రెడ్డికి ఇద్దరు కుమారులు షాపూర్ నగర్ లో నివాసం ఉంటున్నారు. గత రాత్రి 11 గంటలకు తన అన్న సందీప్ రెడ్డికి తమ్ముడైనటువంటి మృతుడు జగదీష్ ఫోన్ చేసి తనకు వ్యక్తిగత సమస్యలు ఉన్నాయని తాను ఇంటికి రావడం లేదని చెప్పారు. మాట్లాడుకుందాం ఇంటికి రమ్మని అన్న పిలవగా జగదీష్ తాను రాను అని ఇంటి వద్దనున్న బైకును తీసుకొని వెళ్లిపోయాడు అర్ధ రాత్రి దాటిన తర్వాత తన మిత్రులకు జగదీష్ వాట్సాప్ మెసేజ్ లో తాను ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికిన జగదీష్ ఆచూకీ లభించలేదు. తెల్లవారుజామున 6 గంటలకు పోలీస్ స్టేషన్ వెళ్లగా కొంతమంది స్థానికులు సబ్ స్టేషన్ వెనకాల ఉరివేసుకున్నట్లుగా సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# స్పోర్ట్స్ అథారిటీ నూతన లోగోను ఆవిష్కరించిన సీఎం రేవంత్




**విశ్వంభర, హైదరాబాద్:** నూతన క్రీడా చరిత్రకు నాంది క్రీడాభిమాని ముఖ్యమంత్రిగా ఉండడం తెలంగాణ క్రీడాకారులందరికి శుభపరిణామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేన రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్పోర్ట్స్ అథారిటీ నూతన లోగోను ఆవిష్కరించుకోవడం ఎంతో సంతోషకరమని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ క్రీడలకు మంచి రోజులు వచ్చాయని ఆయన అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన చిహ్నం (లోగో) ను ఆవిష్కరించిన అనంతరం క్రీడా శాఖ ఎల్ బీ స్టేడియంలో క్రీడా శాఖ అధికారులు, కోచ్ లు, సిబ్బందితో కలిసి లోగో పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు పట్టుదలను ఐక్యత స్ఫూర్తిని కలిగించే వారిని ఉన్నతమైన శక్తిమంతులుగా చేయడమే స్పోర్ట్స్ అథారిటీ లక్ష్యమని "జీవితం కోసం క్రీడలు" అనే నినాదముతో జీవన తత్వాన్ని క్రీడల్లో ప్రతిబింబించే విధంగా ఒలంపిక్స్ చిహ్నంలోని రంగులను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ స్థానిక క్రీడా పౌరుషాన్ని ప్రపంచ క్రీడారంగ వారసత్వంతో జోడించడం ఈ లోగో సూచిస్తుందని ఆయన అన్నారు. క్రీడాకారుల ఉన్నతమైన ఆకాంక్షలను సఫలీకృతం చేసే క్రీడా విద్య చేతల స్ఫూర్తి కి గుర్తుగా ఈ లోగోను తీర్చిద్దామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ఏ సోనీ బాలాదేవి డిప్యూటీ డైరెక్టర్లు శ్రీమతి అనురాధ, చంద్రారెడ్డి, రవీందర్, సుజాత, అసిస్టెంట్ డైరెక్టర్ కందారి బట్టర్, జిల్లా హైదరాబాద్ జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారి సుధాకర్ రావు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీలు నిర్వహించిన ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు



**విశ్వంభర, మల్కాజ్ గిరి:** ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద మల్కాజ్గిరి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు వాహనాల విస్తృత తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలకు చలాన్లు వేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస రావు, ఉప్పల్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ లక్ష్మి మాధవి పాల్గొని వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద జరుగుతున్న తనిఖీలలో నెంబర్ ప్లేట్లు సరిగా లేనటువంటి సుమారు 95 ద్విచక్ర వాహనాలను, ఐదు కార్లను పట్టుకొని చాలాన్లు వేసినట్లు తెలిపారు. వాహనదారులు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలతో పాటు వారి నెంబర్ ప్లేట్లు సరిగా ఉండాలని, ఇన్సూరెన్స్, లైసెన్స్, సీట్ బెల్ట్, హెల్మెట్ తప్పక కలిగి ఉండాలని ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని సూచించారు. నెంబర్ ప్లేట్లు మార్పిడి చేసి నడిపిస్తున్నటువంటి వాహనాలపై కఠిన చర్యలు ఉంటాయని ఏసీపీ తెలిపారు. ఈ తనిఖీలలో ఉప్పల్ ట్రాఫిక్ ఎస్హెచ్ఓ లక్ష్మీ మాధవి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మాపురంలో ముత్యాలమ్మ బొనాలు



**విశ్వంభర, రామన్నపేట:** రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలను గ్రామ ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వేప ఆకులు, పసుపు, కుంకుమలతో అలంకరించుకుని డప్పులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి ముత్యాలమ్మ తల్లికి నైవేద్యంగా సమర్పించి బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఆయురారోగ్యాలతో ఉంచాలని ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పు ప్రకాష్, బత్తుల వెంకటేశం, గొర్ల నర్సింహ, పులిపల్పుల వీరస్వామి, బత్తుల మల్లేష, బత్తుల గోపాలు పాల్గొన్నారు.

## కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన



**విశ్వంభర, నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపురం మండలంలోని వాయిల్లపల్లి, పుట్టపాక గ్రామపంచాయతీలో కేంద్ర జల శక్తి విభాగం నోడల్ అధికారి సౌరబ్ సింగ్, డిప్యూటీ సెక్రటరీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఉపేంద్ర దొండే, శాస్త్రవేత్త కేంద్ర భూగర్భ వనరులు, సాంకేతికత కు చెందిన అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి నాగి రెడ్డితో కలిసి కేంద్ర జల శక్తి అభియాన్ లో భాగంగా డబ్ల్యుడీసీ, పీఎంకేఎస్ వై 2.0 కార్యక్రమంలో నిర్మించిన, చిన్న నీటి కుంటలు, చెక్ డ్యాములు, ఇంకుడు గుంతలు మొదలగువాటిని పరిశీలించి దీనివల్ల ఎంత మందికి ఉపయోగం కలుగుతుందని స్థానిక రైతులు, ప్రజలతో కలిసి మాట్లాడారు. అనంతరం రామస్వామి గుట్ట వద్ద కమ్యూనిటీ ప్లాంటేషన్ లో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం అయిన మేరా మాకే నామ్ సే ఏక్ పెడ్ (అమ్మ పేరు పైన ఒక మొక్క) అనే కార్యక్రమంలో స్థానిక అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి జి.సురేష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే. ప్రమోద్ కుమార్, ఏపీవో ప్రశాంతి, పీ ఓ ఇనాయతుల్లా ఖాన్, పంచాయతీ కార్యదర్శులు బోయిని వెంకటేశం, సత్యం, టీ.ఏ సైదులు, నరసింహ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కుక్క కాటు నియంత్రణ పై అవగాహన కార్యక్రమం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్ బీ నగర్ జోనల్ కార్యాలయములో జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షతన కుక్క కాటు నియంత్రణ అవగాహనా కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమములో కుక్క కాటు నియంత్రణ, పెంపుడు కుక్కల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, 100 శాతం వీధి కుక్కల కాటు నియంత్రణ, రేబిస్ వ్యాధి నివారణ కొరకు అవగాహనా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో కాప్రా, ఉప్పల్, హయత్నగర్, ఎల్ బి నగర్, సరూర్ నగర్ సర్కిల్స్ డిప్యూటీ కమిషనర్లు, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, సీనియర్ ఏంటోమోలోజిస్ట్, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) అధికారులు పాల్గొన్నారు.

## ప్రతిస్పందనను రేకెత్తించేవి చిత్రాలే



### టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్

**హైదరాబాద్:** చరిత్రలోనూ మన జీవితంలో కూడా ముఖ్యమైన క్షణాలను మనం వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు చాలా తరచుగా ప్రతిస్పందనను రేకెత్తించేవి చిత్రాలే అని టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం హైదరాబాద్, బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్ లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన 2024 ను గురువారం వీసీ సజ్జనార్ తిలకించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా ప్రపంచానికి బలమైన సందేశాన్ని పంపడానికి రాష్ట్రానికి చెందిన ఫోటోజర్నలిస్టులు చేసిన ఈ సృజనాత్మక పనికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఫోటోజర్నలిస్టులు తమ చుట్టూ ఉన్న ప్రకృతి, మానవీయ ఘటనలు, వివిధ సంఘటనలు, సమాజం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రపంచం గురించి ఈ ప్రదర్శనలో ప్రదర్శించిన చిత్రాలు బలమైన అనుభూతిని కలిగించే విదంగా ఉన్నాయని అన్నారు. విలువఆధారిత జర్నలిజం కోసం యువ ఫోటో జర్నలిస్టులు కృషి చేయాలనీ అయన సూచించారు. టీజీఎస్ఆర్టీసీ "త్రూ ది లెన్స్" అనే థీమ్ మీద ఫోటోగ్రఫీ పోటీలు, ప్రదర్శన, ఉత్తమ చిత్రాలకు పురస్కారాల కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం నిర్వహించాలని ఇందుకు టీజీఎస్ ఆర్టీసీ అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తుందని వీసీ సజ్జనార్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ఉపాధ్యక్షులు టీ. కిషోర్ సింగ్, పి. రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, కోశాధికారి అనిల్ కుమార్ కర్ణకోటి, కార్యవర్గ సభ్యులు ఎండి. అలీముద్దీన్, నగర గోపాల్, ప్రదర్శన నిర్వహణ కమిటీ కన్వీనర్ ఏ. మహేష్ కుమార్, సభ్యులు పి. సురేంద్ర, ఎల్లేశా, వెంకటేష్ పాల్గొన్నారు.

## రుణమాఫీ రైతులందరికి అందాలి : బీఆర్ఎస్




**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మున్సిపాలిటీ రైతు సహకార సంఘం కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణమాఫీ చేయడంలో అడ్డగోలు ఆంక్షలతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నందుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టినట్లు తెలియజేశారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన డీఈ

**విశ్వంభర, ఎల్బీనగర్:** విద్యుత్ వైర్లు మార్చడం, నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు కోసం రూ.18000 లంచం తీసుకుంటూ సరూర్నగర్ విద్యుత్ సర్కిల్ డీఈ (టెక్నికల్) రామ్మోహన్ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. ఆటోనగర్ లోని సూపరింటెంట్ ఇంజనీర్/ఆపరేషన్ కార్యాలయం సరూర్నగర్ సర్కిల్ కార్యాలయంలో గురువారం రామ్మోహన్ ను పట్టుకున్నారు. ఇబ్రహీంపట్నం మాంచాల మండలం ఆగాపెల్లి రెండు ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వెంచర్ చేస్తున్నారు. లేఓట్లు 11 కే.వీ, 33 కెవి విద్యుత్ లైన్లు తొలగించడంతో పాటు, అదే వెంచర్ లో 63 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు కోసం లేఔట్ వెంచర్ నిర్వాహకుడు గుత్తేదారుడితో కలిసి ఆన్లైన్లో దరఖాస్తు చేశాడు. దీంతో 11 కేవీ, 33 కేవీ లైన్లు మార్చడానికి రూ .10,000లు, 63 కేవీ విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు కోసం రూ. 8000లు డిమాండ్ చేశాడని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. గుత్తేదారు, వెంచర్ నిర్వాహకుడు కలిసి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు రామ్మోహన్ కార్యాలయంలో రూ.18,000 లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఏ డీ ఈ పై కూడా దర్యాప్తు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



## గుండెపోటుతో సౌదీలో మెట్ పల్లి వాసి మృతి

### మృతదేహాన్ని రప్పించాలని ప్రభుత్వానికి వినతి



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణానికి చెందిన అల్లి రామస్వామి ఉపాధి నిమిత్తం కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్ లో పనిచేస్తున్నాడు. ఇటీవల కాలంలో ఆరోగ్యం క్షీణించి గుండెపోటుతో మరణించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అల్లే రామస్వామి కుటుంబ సభ్యులు విషయం తెలియగానే కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించే విధంగా ప్రభుత్వం సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుచున్నారు. రామస్వామికి భార్య మానస, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయి అధ్యక్షులు బత్తిని రాజా గౌడ్ మృతుడు అల్లే రామస్వామి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని, రామస్వామి కుటుంబానికి గల్ఫ్ బోర్డు సంక్షేమం ద్వారా ఆర్థిక సహాయం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## ఇందిరమ్మ రాజ్యం పేరుతో తెలంగాణను రావణకాష్టం చేస్తున్న కాంగ్రెస్



**విశ్వంభర, తుంగతుర్తి:** ఇందిరమ్మ రాజ్యం పేరుతో తెలంగాణను రేవంత్ రెడ్డి రావణకాష్టం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. రుణమాఫీ కోసం దీక్షలు చేస్తే బాంబులతో దాడి చేసే స్థాయికి కాంగ్రెస్ నేతలు దిగజారారని వారు మండి పడ్డారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడి చేయడాన్ని బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేసే దాకా బీఆర్ఎస్ పోరాటం ఆగదని హెచ్చరించారు.

## పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి ప్రత్యేక పూజలు



**విశ్వంభర, కందుకూరు:** కందుకూర్ మండల కేంద్రంలోని సార్లరావు పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జర్పుల లక్పతి నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ జర్పుల ప్రవీణ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుడి నిర్మాణం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జర్పుల టిక్లాన్ నాయక్, నేనావత్ సీతారాం నాయక్, మంగు నాయక్, రఘు నాయక్, శ్రీను నాయక్, జంగయ్య, రాజు పాల్గొన్నారు.

## పెళ్లి కి ఉప్పల ఫౌండేషన్ చేయూత




**విశ్వంభర, ఎల్బీనగర్:** నాగోల్ లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మోటం గణేష్ జగదాంబల కుమార్తె మౌనిక వివాహానికి పూస్తే మట్టెలు చీర, గాజులు ను టీ పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అందజేసారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక పేద కుటుంబాలకు చెందిన వారికి పూస్తే మట్టెలు చీర గాజులు అందజేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కావెలి రాములు తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర
V3 NEWS

# జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- 11 ఏళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వినతిపత్రం
- 1654 మంది గెస్ట్ లెక్చరర్లను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో గత 11 సంవత్సరాలుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద గురువారం జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్లు తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. గత 11 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, 1654 కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. త్వరలో జరగనున్న 1392 పోస్టులను రెగ్యూలర్ రిక్రూట్‌మెంట్ తో సంబంధం లేకుండా గత 11 సంవత్సరాల సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఈ క్రమంలో అక్కడికే వచ్చిన ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే జూనియర్ కాలేజ్ గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని కోరారు. . గెస్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వారిని ప్రభుత్వ తప్పకుండా ఆదుకుంటుందని తెలిపారు. రెన్యూవల్ ఉత్తర్వులు ఇంకా పెండింగ్ లో ఉన్న విషయం తెలుపగా.. వెంటనే ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణా రావు కు కాల్ చేసి త్వరగా రెన్యూవల్ ఉత్తర్వులు విడుదలయ్యేలా చూడాలని తెలిపారు. గెస్ట్ లెక్చరర్ల ఉద్యోగ భద్రత గురించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి అమలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామెర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి దార్ల భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ కోడి మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు ఎం. బాబురావు, సీహెచ్ దేవయ్య, కోశాధికారి బండి కృష్ణ, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్, డా,, ప్రసాద్, ఎస్. పరమేష్, మల్లికార్జున్, మల్లికార్జున్, యాదగిరి, చంద్రమోహన్, మహిళా కార్యదర్శి అరుణ వెంకటేష్, శివలీల, ఎస్. శ్రీధర్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు

**వాతావరణ శాఖ హెచ్చరిక**

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.గురువారం ఆదిలాబాద్, కుమ్రంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మెదక్, కామారెడ్డి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అలాగే గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం నాడు నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.
శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదివారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

## నడుస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఒకరి మృతి

**విశ్వంభర,హైదరాబాద్:** నడుస్తున్న రైలులో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసు కుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్యన ఖాజమోహినుద్దీన్ (35) సికింద్రాబాద్ నుంచి భువనగిరి వెళ్తుండగా ప్రమాదవశాత్తు రైల్లోంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి భార్య, 7 సంవత్సరాలు కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తార్నాకలో నేల కూలిన భారీ వృక్షం

**తెగిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు**



**విశ్వంభర, హైదరాబాద్ :** సికింద్రాబాద్ తార్నాకలో గురువారం భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కొమ్మలు హైటెన్షన్ విద్యుత్ వైర్లపై పడడంతో అవి తెగిపడ్డాయి. ఆ సమయంలో వైర్ల కింద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి హుటాహుటిన డీఆర్ఎస్ బృందం, హార్టికల్చర్, విద్యుత్, శానిటేషన్ అధికారులను అప్రమత్తం చేసి, అక్కడికి చేరుకున్నారు. చెట్ల కొమ్మలను తొలగింపజేసి, సమస్యను పరిష్కరింపజేశారు. తార్నాక డివిజన్‌లోని ప్రతి కాలనీలో ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్లను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## వేములవాడ రాజన్న ఆలయంలో ఏసీబీ దాడులు

**పలు విభాగాల్లో తనిఖీలు..రికార్డులు స్వాధీనం**



**విశ్వంభర, హైదరాబాద్:** దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డీఎస్పీ రమణమూర్తి, సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ నేతృత్వంలో ఏసీబీ బృందం అన్నదాన సత్రం, ధర్మశాల, లడ్డూ తయారీ యూనిట్, గోడౌన్, ఆడిట్ విభాగం తదితర విభాగాల్లో తనిఖీలు నిర్వహించింది. పలు రికార్డులను స్వాధీనం చేసుకుంది. ఈ తనిఖీల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు. గతంలో కూడా ఆలయంలో ఏసీబీ దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ రాజన్న ఆలయంలోని పలు విభాగాలలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడంతో దాడులు జరిపామని తెలిపారు. తూనికలు కొలతలు, ఫుడ్ సేఫ్టీ, ఆడిట్ అధికారులతో కలిసి విచారణ చేపడుతున్నామన్నారు. ఇక వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసంలో రద్దీ కొనసాగుతూ ఉండడం , వచ్చే నెల 3వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన సమయంలో ఆలయంలో ఏసీబీ దాడులు చర్చనీయాంశంగా మారాయి.

## మురికి కాల్వలో పడి రెండేళ్ల చిన్నారి మృతి

- పన్నెండు గంటల తర్వాత మృతదేహం లభ్యం
- నిజామాబాద్‌లో విషాదం



**విశ్వంభర, నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. డ్రైనేజీలో పడి రెండేళ్ల చిన్నారి మృతి చెందింది. కాల్వ వద్ద ఆడుకుంటుండగా డ్రైనేజీలో పడిపోయిన చిన్నారిని స్థానికులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది చేరుకొని గాలింపు చర్యలు చేపట్టి చిన్నారి మృతదేహాన్ని బయటికి తీశారు.ఆనంద్‌నగర్‌లో బుధవారం సాయంత్రం డ్రైనేజీలో గల్లంతైన చిన్నారి మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. చిన్నారి గల్లంతైన పన్నెండు గంటల తర్వాత మృతదేహాన్ని మున్సిపల్ , అగ్నిమాపక సిబ్బంది సిబ్బంది గుర్తించారు. పాప మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానికుల కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన దంపతులు గత కొంతకాలంగా నగరంలోని ఆనంద్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. భర్త సేల్స్‌మెన్‌గా, భార్య క్యాటరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి చిన్న కుమార్తె బుధవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. కొంత సమయం తర్వాత చిన్నారి కనిపించలేదు.చిన్నారి నాన్నమ్మ చెల్లి ఎక్కడ అని మనవడిని అడగటంతో మురుగు కాల్వ వద్ద ఆడుకుంటోందని చెప్పాడు. అక్కడ వెళ్లి చూడగా బాలిక కనిపించలేదు. దీంతో కాల్వలో తన మనవరాలు పడిపోయిందని ఏడుస్తూ గట్టిగా కేకలు వేసింది. ఆ అరుపులకు స్థానికులు అక్కడికి చేరుకొని విషయం తెలుసుకొని మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మున్సిపల్ కమిషనర్ మకరందు, ఫైర్ స్టేషన్ అధికారి నర్సింగ్‌రావు చేరుకొని సిబ్బందితో కాల్వలో గాలింపు చర్యలు చే పట్టారు.కాల్వలో చి న్నారి కోసం పొక్లెయినర్ సహాయంతో వెతికినా ఆచూకీ లభించలేదు. చిన్నారి తల్లి పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాగా విషయం తెలియడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమార్తె కాల్వలో పడిందంటే నమ్మకుండా తండ్రి చుట్టుపక్కల వెతకడం స్థానికులను కన్నీరు పెట్టించింది. మురుగు కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గాలింపు చర్యలు ఇబ్బందికరంగా మారింది. చివరికి కష్టపడి గురువారం ఉదయం మున్సిపల్ సిబ్బంది చిన్నారి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

## రాష్ట్రవ్యాప్తంగా బీఆరెస్ నిరసనలు



- పలుచోట్ల ఉద్రిక్తతలు
- దాడులు చేయడం దుర్మార్గమైన చర్య: హరీశ్ రావు

**విశ్వంభర, హైదరాబాద్:** రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందంటూ గురువారం బీఆరెస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టగా పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయసూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ నేతలు రైతులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా కాంగ్రెస్ కి వ్యతిరేకంగా నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులకు, బీఆర్ఎస్ శ్రేణులకు మధ్య ఘర్షణ నెలకొంది. రాళ్లతో, కోడి గుడ్లతో దాడి చేసుకున్నారు. కారు అద్దాలు ధ్వంసం చేశారు. కాంగ్రెస్ శ్రేణులు గాదరి కిషోర్ పైకి దూసుకొచ్చారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. అలర్ట్ అయిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. రుణమాఫీ కోసం దీక్షలు చేస్తే బాంబులతో దాడి చేసే స్థాయికి కాంగ్రెస్ వారు దిగజారారని బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో, రుణమాఫీ చేయాలని డిమాండ్ చే చేశారు. రైతులందరికీ రుణమాఫీ పూర్తి చేసే దాకా బీఆర్ఎస్ పోరాటం ఆగదని పార్టీస్పష్టం చేసింది.

**దుర్మార్గమైన చర్య : హరీశ్ రావు**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పట్టణంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కారు అద్దాలు ధ్వంసం చేసి రాళ్లు, కోడిగుడ్లతో దాడి చేయటం దుర్మార్గమైన చర్య గా ఆయన అభివర్ణించారు. ప్రజాపాలనలో నాయకులు, జర్నలిస్టులపై దాడులు చేస్తారా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ఇలాంటి దాడులు జరగలేదనీ , ప్రజా సమస్యల పట్ల ప్రశ్నించే గళాలను రేవంత్ సర్కారు అణిచివేసే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీని డిమాండ్ చేస్తున్నానన్నారు.

**రేవంత్ రెడ్డి డైరెక్షన్ లోనే దాడులు: జగదీశ్‌రెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి డైరక్షన్ లోనే బీఆర్ఎస్ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని సూర్యాపేట బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆరోపించారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడి సమాచారం తెలుసుకున్న ఆయన తిరుమగిరి వెళ్లి ధర్నాను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న తిరుమలగిరి బీఆరెస్ శిబిరంపై కాంగ్రెస్ దాడిని ఖండిస్తున్నామన్నారు.

## కర్మన్ ఘాట్ హనుమాన్ సేవలో ఏపీ మాజీ మంత్రి రోజా



**విశ్వంభర, ఎల్బీనగర్:** కర్మన్ ఘాట్ లోని ప్రాచీన హనుమాన్ దేవాలయంలోని ఆంజనేయ స్వామిని ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సినీ నటి రోజా దర్శించుకున్నారు. స్వామివారికి ముడుపు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి రోజాకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## కార్మికుల సమస్యలపై పోరాడాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** న్యూఢిల్లీలో జరిగిన ఐ ఎన్ టీ యు సీ ఫెడరేషన్ జాతీయ మహాసభలకు రాష్ట్ర అధ్యక్షులు బుద్ధారం మురారి ఆధ్వర్యంలో తెలంగాణ నుండి జిల్లాల అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో కార్మికుల సమస్యల గురించి విశ్లేషించారు. ముఖ్యంగా కార్మికుల పట్ల చిన్న చూపు చూస్తున్న ప్రైవేటు కంపెనీలపై పోరాడాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా తరపున ఐఎన్టీయుసీ అధ్యక్షులు ఆమనగల్ పట్టణానికి చెందిన యంగలి ప్రసాద్ పాల్గొని జిల్లా తరపున మెమొంటోను అందుకున్నారు.

## లారీ కిందపడి తల్లీ కూతుళ్ల మృతి

**బైక్ ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం**



**విశ్వంభర, జడ్చర్ల:** లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో తల్లీబిడ్డలు మృతి చెందిన విషాదమిది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ గోప్లాపూర్ గ్రామాల మధ్య చోటు గురువారం ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జడ్చర్ల మండలం లింగపేట గ్రామానికి చెందిన చెన్న కేశవులు, రేఖ(27) భార్యాభర్తలు. వారికి కుమార్తె స్వాతిక(3) ఉంది. చెన్నకేశవులు జడ్చర్ల సమాపంలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. రాఖీ పండుగ సందర్భంగా రేఖ కుమార్తె సాత్వికతో కలిసి తన సోదరుడికి రాఖీ కట్టేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఎదిరపల్లికి వెళ్లింది. లింగంపేటలో గురువారం బోనాల పండుగ సందర్భంగా మరిదితో కలిసి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. గంగాపూర్‌గోప్లాపూర్ మధ్యలో ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేస్తుండగా, బైక్‌పై నుంచి తల్లీ కూతుళ్లు రేఖ, సాత్విక కింద పడ్డారు. రోడ్డుపై పడిన వారి పైనుంచి లారీ వెళ్లడంతో ఇద్దరి తలలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న లింగంపేట వాస్త్యవ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గంగాపూర్‌లింగపేట మధ్యలో ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయని చర్చించుకున్నారు. కొందరు మృత్యువాత పడగా, మరెందరో తీవ్రంగా గాయపడ్డారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అరగంట పాటు గ్రామస్థులు రాస్తారోకో చేశారు. వారిని పోలీసులు సముదాయించి, ఆందోళన విరమింపజేశారు. అనంతరం మృతదేహాలను జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

## రుణమాఫీ ఓ పెద్ద నాటకం

**రైతులకు తీరని ద్రోహం చేస్తున్న ప్రభుత్వం మానుకోట ధర్నాలో ఎమ్మెల్సీ సత్యవతి విమర్శ**



**విశ్వంభర, హైదరాబాద్:** రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ పద్ధతి ప్రభుత్వం సరికొత్త నాటకానికి తెర దీసిందని, రైతులకు రుణమాఫీ చేశామని బూటకపు మాటలు మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మానుకోట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఒకమాట. ఎన్నికల తరువాత ఒక మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులకు తీరని ద్రోహం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం రూ.45వేల కోట్లు అని చెప్పి, ఇప్పుడు కేవలం రూ.17వేల కోట్లే మాఫీ చేసి, మిగిలిన చాలామంది రైతులకు అన్యాయం చేశారని చెప్పారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మాట్లాడుతు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు రైతులకు మాటిచ్చి మోసం చేశారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికి రుణమాఫీ చేయని సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీరెల్లి భరత్‌కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రిన్సిపాల్‌తో సహా నలుగురికి పాలిగ్రాఫ్ టెస్ట్ కోసం..

**కోర్టు అనుమతి కోరిన సీబీఐ**



**ఢిల్లీ:** కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం హత్య కేసుపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌తో పాటు మరో నలుగురికి పాలిగ్రాఫ్ పరీక్ష నిర్వహించేందుకు కోర్టు అనుమతి కోరింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు గత వారం కోల్‌కతా పోలీసుల నుంచి దర్యాప్తును సీబీఐ స్వీకరించింది. మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌ను ఇప్పటికే పలు సార్లు ప్రశ్నించింది. జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో ఆయన పాత్రపై సీబీఐ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా, వైద్యురాలి మృతదేహాన్ని చూసేందుకు ఆమె తల్లిదండ్రులను దాదాపు మూడు గంటలపాటు సందీప్ ఘోష్ వేచి ఉంచిన ఆరోపణలపై కూడా సీబీఐ ఆయనను ప్రశ్నించింది. అలాగే డాక్టర్ మృతదేహాన్ని గుర్తించిన సెమినార్ హాల్ ప్రక్కనే ఉన్న గదుల పునరుద్ధరణ పనుల గురించి కూడా ఘోష్‌ను అడిగింది. ఆయన చెప్పిన సమాధానాలను లై డిటెక్టర్ టెస్ట్ ద్వారా పోల్చి చూడాలని సీబీఐ భావిస్తున్నది. మరోవైపు ఈ కేసుకు సంబంధించి అరెస్టైన వాలంటీర్ సంజయ్ రాయ్‌కు పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించేందుకు సీబీఐ ఇప్పటికే హైకోర్టు అనుమతిని పొందింది.

## తెలంగాణ గ్రూప్ 2 షెడ్యూల్ విడుదల

- డిసెంబర్ 15,16తేదీల్లో పరీక్షలు

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణలోని గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. డిసెంబర్ 15, 16వ తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి.పేపర్ 1(జనరల్ స్టడీస్ & జనరల్ ఎబిలిటీస్) పరీక్షను డిసెంబర్ 15వ తేదీ మొదటి సెషన్‌లో, పేపర్ 2 (హిస్టరీ, పాలిటీ, సొసైటీ) పరీక్షను రెండో సెషన్‌లో నిర్వహించనున్నారు. పేపర్ 3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్షను 16వ తేదీ మొదటి సెషన్‌లో, పేపర్ 4 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర అవతరణ) రెండో సెషన్‌లో నిర్వహించనున్నారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు.గతంలో నిర్ణయించిన షెడ్యూల్ మేరకు ఈ ఆగస్టు 7, 8వ తేదీల్లోనే గ్రూప్ 2 పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షల మధ్య వారం రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో వారి డిమాండ్‌కు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేసింది. తాజాగా ఇప్పుడు పరీక్ష షెడ్యూల్‌ను టీజీపీఎస్సీ ప్రకటించింది. మొత్తం 783 పోస్టుల భర్తీకి గ్రూప్2 పరీక్ష జరగనుంది.

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మందకృష్ణ మాదిగ

### ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అమలుపై చర్చ



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ భేటీ అయ్యారు. గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిశారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి మంద కృష్ణ మాదిగా విజ్ఞప్తి చేశారు. మందకృష్ణతో పాటు సీఎంను కలిసిన వారిలో మంత్రి దామోదర రాజనరసింహ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు ఉన్నారు. మందకృష్ణతో భేటీ ఫోటోలను ట్విటర్ ఎక్స్ వేదికగా పోస్టు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కలిశారని, ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు అమలుపై భేటీలో చర్చించామని తెలిపారు.

## రాహుల్ గాంధీ నైరాశ్యంలో కూరుకుపోయారు : కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్

**ఢిల్లీ:** లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గురువారం విమర్శలతో విరుచుకుపడ్డారు. జమ్ము కశ్మీర్ ప్రజలను రాహుల్ రెచ్చగొడుతున్నారని, కాంగ్రెస్ ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తుందని ఆయన చెబుతున్నారని కానీ దేశం దీన్ని అంగీకరించదని అన్నారు. నిరాశలో కూరుకుపోయిన రాహుల్ గాంధీ నైతిక స్థైర్యం కోల్పోయారని అన్నారు.రాహుల్ తన కులం, మతం గురించి చెప్పలేరని, కానీ రాజకీయ భాషలో ఓబీసీల గురించి మాట్లాడుతుంటారని ఎద్దేవా చేశారు. కాగా, నియంతృత్వ పోకడలతో చెలరేగే ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసాన్ని కాంగ్రెస్ వమ్ము చేసిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. జమ్ములో గురువారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, ఆరెస్సెస్ మధ్య సైద్ధాంతిక పోరాటం సాగుతున్నదని, మీరు మా పక్షాన నిలిచారని కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ అన్నారు.తాను పార్లమెంట్‌లో కూర్చుండగా మోదీని చూశానని, మీరు ఆయన విశ్వాసాన్ని మటుమాయం చేశారని తాను చెప్పగలనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని మోదీకి మానసికంగా ఎంత టెన్షన్ ఇచ్చారంటే ఆయన సైకాలజీ పతనమైందని వ్యాఖ్యానించారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కార్యకర్తలను కోరారు.

## మోదీ విశ్వాసాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు వమ్ము చేశారు



**ఢిల్లీ:** నియంతృత్వ పోకడలతో చెలరేగే ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసాన్ని కాంగ్రెస్ వమ్ము చేసిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. జమ్ములో గురువారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, ఆరెస్సెస్ మధ్య సైద్ధాంతిక పోరాటం సాగుతున్నదని, మీరు మా పక్షాన నిలిచారని కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ అన్నారు.తాను పార్లమెంట్‌లో కూర్చుండగా మోదీని చూశానని, మీరు ఆయన విశ్వాసాన్ని మటుమాయం చేశారని తాను చెప్పగలనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని మోదీకి మానసికంగా ఎంత టెన్షన్ ఇచ్చారంటే ఆయన సైకాలజీ పతనమైందని వ్యాఖ్యానించారు. జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కార్యకర్తలను కోరారు.కాగా, జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ఖర్గే అంతకుముందు శ్రీనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ జమ్ము కశ్మీర్‌లో మనం విజయం సాధిస్తే దేశమంతా మన నియంత్రణలోకి వస్తుందని అన్నారు. జమ్ము కశ్మీర్‌తో రాహుల్ గాంధీ అనుబంధం రక్తసంబంధమని ఖర్గే చెప్పుకొచ్చారు.

## షేక్ హసీనాకు షాక్..
# మాజీ ప్రధాని దౌత్య పాస్‌పోర్టు రద్దు



**ఢాకా:** మాజీ ప్రధాని షేక్ హసీనాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఆమె దౌత్య పాస్పోర్టును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన ఈ దౌత్య పాస్పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేకసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. ఆగస్టు 5 నుంచి ఆమె భారత్లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు దేశాధ్యక్షుడు పార్లమెంటును రద్దు చేశారు. తాత్కాలిక పరిపాలన యంత్రాంగానికి యూనస్ సారథిగా నియమితులయ్యారు. ఈ ప్రభుత్వమే పాస్ పోర్టులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో ఆమెకు దౌత్యపరంగా ఉన్న అన్ని వెసులుబాట్లు లేకుండాపోతాయి. ఆ పాస్పోర్టు వల్లే ఆమె బంగ్లాదేశ్ నుంచి భారత్కు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలాఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. బంగ్లాలో చోటుచేసుకున్న హింసాకాండకు సంబంధించి హసీనాపై హత్య అభియోగాలు సహా పలు కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో విచారణ జరిపేందుకు హసీనాను తమ దేశానికి అప్పగించాలని తాజాగా బీఎన్ పీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ ఆలంగిర్ డిమాండు చేశారు."మన పొరుగుదేశం ఆమెకు ఆశ్రయం కల్పించడం విచారకరం. అక్కడినుంచి ఆమె బంగ్లా విజయాన్ని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. హసీనాను మీరు (భారత్ను ఉద్దేశిస్తూ) న్యాయబద్ధంగా బంగ్లాదేశ్కు అప్పగించాలి. పలు అభియోగాల్లో ఆమెను విచారించాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆమెను విచారణ ఎదుర్కోనివ్వండి" అని ఆలంగిర్ పేర్కొన్నారు. రిజర్వేషన్ వ్యతిరేక నిరసనల్లో వందలమంది ప్రాణాలు కోల్పోయారు. ఆ మరణాలకు హసీనా, ఆమె అనుచరులపై 30కి పైగా కేసులు నమోదు అయ్యాయి.

## క్రైమ్ సీన్ మొత్తాన్ని మార్చేశారు..

- వైద్యురాలి హత్యాచార ఘటనపై
- కోర్టుకు స్టేటస్ రిపోర్ట్ సమర్పించిర సీబీఐ




**ఢిల్లీ:** పశ్చిమబెంగాల్ లోని ఆర్టీజీ కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా విచారిస్తోంది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన సీబీఐ గురువారం కోర్టుకు స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. ఇందులో కీలక విషయాలను సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తాము వెళ్లేసరికి క్రైమ్ సీన్ మొత్తాన్ని మార్చేశారని సీబీఐ ఆరోపించింది.“ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన 5 రోజుల తర్వాత దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. దీంతో ఇప్పుడు దర్యాప్తు సవాల్ గా మారింది. మేం ఐదు రోజుల తర్వాత ఘటన జరిగిన ఆసుప్రతికి వెళ్లేసరికి క్రైమ్ సీన్ను మార్చినట్లు గుర్తించాం. ఇక బాధితురాలి దహన సంస్కారాలు పూర్తి చేసిన తర్వాత అర్ధరాత్రి సమయంలో ఎస్ఐఆర్ నమోదుచేయడం దిగ్భ్రాంతికరం. తొలుత ఆమెది ఆత్మహత్య అని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారని అనుమానించిన బాధితురాలి సహోద్యోగులు, యువ వైద్యులు వీడియోగ్రఫీకి పట్టుబట్టారు. దీంతో అప్పుడు పోస్ట్మార్టంను వీడియో తీశారు” అని సీబీఐ కోర్టుకు వివరించింది.

**క్రైమ్సీను సీల్ చేయడంలో ఆలస్యం ఎందుకు?: సుప్రీం**

సీబీఐ నివేదికను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. ఈసందర్భంగా కోల్కతా పోలీసుల తీరుపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కేసు నమోదులో లోపాలపై ప్రశ్నల వర్షం కురిపించింది. “బాధితురాలు తీవ్ర గాయాలతో అర్ధనగ్న స్థితిలో విగతజీవిగా కన్పించింది. అయినా ఆమెది అసహజ మరణం అని రికార్డుల్లో ఆలస్యంగా నమోదుచేయడం తీవ్ర ఆందోళనకరం. అంతేగాక.. అసహజ మరణం అని నమోదు చేయడానికి ముందే పోస్ట్మార్టం నిర్వహించడం ఆశ్చర్యంగా ఉంది. శవపరీక్ష జరిగిన 18 గంటల తర్వాత క్రైమ్ సీన్ ను సీల్ చేశారెందుకు?" అని కోర్టు ప్రశ్నించింది.

ఈ కేసులో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తీరు అనుమానాస్పదంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసును తొలుత రికార్డుల్లో రాసిన పోలీసు అధికారి తదుపరి విచారణకు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. నిందితుడి వైద్య రిపోర్ట్ను కూడా సమర్పించాలని సీబీఐని సూచించింది.

30 ఏళ్లలో ఇలాంటి లోపాలు చూడలేదు..

కేసు నమోదులో కోల్కతా పోలీసులు ప్రదర్శించిన నిర్లక్ష్యంపై సుప్రీంకోర్టు పెదవి విరిచింది. గత 30 ఏళ్లలో ఇలాంటి లోపాలను చూడలేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పోలీసుల తరపున న్యాయవాదులపైనా కోర్టు అసహనం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా తరహా వాదనలు ఇక్కడ చేయొద్దని హెచ్చరించింది.

**శాంతియుత ఆందోళనలు ఆపొద్దు..**

ఈ కేసులో ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం కొన్ని కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలు చేస్తున్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే ఆందోళన చేస్తున్న వైద్యులు తిరిగి విధుల్లో చేరాలని సూచించింది. విధుల్లో చేరిన తర్వాత వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని అధికారులను సూచించింది. ఇక, నిందితుడికి పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేలా శుక్రవారం లోగా ఆదేశాలివ్వాలని కోల్కతా కోర్టుకు తెలిపింది.

వైద్యుల భద్రత కోసం ఏర్పాటుచేసిన జాతీయ టాస్కోఫోర్స్కు సూచనలు చేసేందుకు ఓ ప్రత్యేక పోర్టల్ను ఏర్పాటుచేయాలని వైద్యారోగ్య సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది. వైద్యుల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యల కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు, పోలీసు అధికారులతో చర్చలు జరపాలని పేర్కొంది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబరు 5వ తేదీకి వాయిదా వేసింది.

## రేవంత్ పాలనలో మరో కీలక అడుగు

- తెలంగాణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా రీజినల్ రింగ్ రోడ్డు
- అర్బన్, రూరల్ తెలంగాణ సమగ్రాభివృద్ధికి ప్లాన్
- నిరంతరం సాఫీగా ప్రయాణాలు సాగేందుకు వీలుగా నిర్మాణాలు
- వీటితో ఇక హైదరాబాద్‌కు మహర్దశే..



**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి సీఎం రేవంత్ రెడ్డి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు . ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలను కలుపుతూ పోయే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రీజినల్ రింగ్ రోడ్డుపై ఫోకస్ పెట్టిన ముఖ్యమంత్రి తాజాగా మారో అడుగేస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పనులపై సెక్రటేరియట్‌లో సీఎం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇందులో అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం భూసేకరణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. భూములిచ్చే రైతులకు న్యాయం చేస్తూ రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ ఆర్) భూసేకరణ పూర్తి పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ నిర్మాణ పనుల్లో పురోగతిపై సంబంధిత కలెక్టర్లు ఇకపై రోజూవారిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించాలని సీఎం పేర్కొన్నారు.అర్బన్ తెలంగాణ, రూరల్ తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఔటర్ రింగ్ రోడ్డు (ఓ ఆర్ ఆర్ ), రీజినల్ రింగ్ రోడ్డు ( ఆర్ ఆర్ ఆర్ ) మధ్య అనుసంధానానికి అనువుగా రహదారుల ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రధాన రహదారులకు అనుసంధానం చేసే ప్రదేశాలను ముందుగానే గుర్తించి నిరంతరం సాఫీగా ప్రయాణాలు సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండాలని సీఎం సూచించారు. .

భవిష్యత్తు అవసరాలే ప్రాతిపదికగా ఆర్ ఆర్ ఆర్ అలైన్‌మెంట్ ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు కానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఈ రోడ్ల ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు.ఆర్ఆర్ఆర్ కింద ఉత్తర భాగం సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ మార్గంలో భూసేకరణ దాదాపుగా పూర్తి కాగా, ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలోని (చౌటుప్పల్ఆమన్‌గల్ షాద్ నగర్ సంగారెడ్డి (189.20 కి.మీ.)మార్గానికి సంబంధించి భూ సేకరణ,అలైన్‌మెంట్ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు.ఆ సూచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక తయారు చేసి త్వరగా అందజేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని సీఎం చెప్పారు.

## జీహెచ్ఎంసీ విస్తరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** అవుటర్ రింగు రోడ్డు పరిధి లోపల ఉన్న గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనంపై, రాష్ట్రప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘానికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఛైర్మన్‌గా, పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహా సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ వరకు గ్రేటర్ హైదరాబాద్‌ను విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని పై గతంలో చర్చించిన రాష్ట్ర మంత్రివర్గం పూర్తిస్థాయి అధ్యయనం కోసం ఈ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఓఆర్ఆర్ వరకు ఉన్న పంచాయతీలు, మున్సిపాలిటీల ప్రజా ప్రతినిధులు, నిపుణులతో మంత్రివర్గ ఉపసంఘం చర్చించనుంది. ఓఆర్ఆర్ వరకు స్థానిక సంస్థల పునర్ వ్యవస్థీకరణపై సిఫార్సులు చేయనుంది.

## బాలాపూర్‌లో బీటెక్ విద్యార్థి దారుణ హత్య

**నిందితుల కోసం పోలీసుల గాలింపు**

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన కలకలం రేపింది. మండి 37 హోటల్‌కు సమీపాన ఉన్న ఓ పాన్ షాపు దగ్గర విద్యార్థి మోండ్రు ప్రశాంత్ (21) పై ముగ్గురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు తీవ్ర గాయాలైన ప్రశాంత్‌ను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ప్రశాంత్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నట్టు పోలీసులు తెలిపారు. ఆ దాడి ఘటనలో ముగ్గురు దుండగులు ఉన్నట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి వివరించారు. ఘటనపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కాగా ఇంజనీరింగ్ విద్యార్థి హత్యకు ప్రేమ వ్యవహారం లేక ఆర్థిక వివాదాల పాత కక్షలే కారణమా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

## కేసీఆర్, హరీశ్‌రావుల ఒత్తిడితోనే డిజైన్లపై సంతకాలు

- త్వరగా చేయాలనడంతో అన్నింటికీ ఆమోదం తెలిపాం
- కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ కు తెలిపిన
- మాజీ ఈఎన్సీ మురళీధర్, సీడీవో మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** మాజీ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఒత్తిడి వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్‌ల ఫైనల్ అప్రూవల్‌లపై తాము సంతకం చేశామని మాజీ ఈఎన్సీ మురళీధర్, సీడీవో మాజీ ఈఎన్సీ నరేందర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం వారిరువురిని కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. డిజైన్ల ఆమోదంపై మొదట తాను సంతకం చేయలేదని, కేసీఆర్, హరీశ్ రావు, ఉన్నతాధికారుల ఒత్తిడి వల్ల సంతకాలు చేసినట్లు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరగా చేయాలన్న ఒత్తిడి వల్ల హడావుడిగా అన్నీ అప్రూవల్ చేశామన్నారు. మేడిగడ్డ ప్రతి డిజైన్‌లో సీడీవోతో పాటు టీ సంస్థ ఎల్ అండ్ టీ పాల్గొందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణ సంబంధ చర్చల్లోతాను పాల్గొనలేదని, ప్రాజెక్టు నిర్మాణం జరిగేటప్పుడే తప్పిదాలు జరిగాయన్నారు. ప్రభుత్వం ఒత్తిడి, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని కుండబద్దలు కొట్టారు. పైనుంచి ఒత్తిడి వల్ల క్వాలిటీ కంట్రోల్ చెక్ సరిగా చేయలేదని, బ్యారేజీ నిర్వహణ, గేట్ల ఆపరేషన్ సరిగా చేయలేదని నరేందర్ రెడ్డి కీలక అంశాలు వెల్లడించారు. ప్రాజెక్టను ఎల్ ఆండ్ టీ లేక మీరు డిజైన్ చేశారా? అడిగిన ప్రశ్నకు సెంట్రల్ డిజైన్ విభాగం రూపొందించిందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగిన ప్రాంతానికి తాను వెళ్లలేదని..నిర్మాణం అసలు తన పరిధిలోనిది కాదని స్పష్టం చేశారు.



# టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి విరాళం



**విశ్వంభర, తిరుమల :** కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. 11 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచియున్నారు. టోకెన్లు లేని భక్తులకు 12 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.12 కోట్లు వచ్చిందన్నారు.కాకినాడకు చెందిన ప్రసన్న కోట విరూపా పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ. కోటి 1,116 విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును దాత కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలోఅదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరికి అందజేశారు.

# విజయవాడలో వైసీపీకి షాక్.. టీడీపీలోకి ముగ్గురు కార్పొరేటర్లు



**విశ్వంభర, అమరావతి :** రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి జై కొట్టడం రాజకీయ నాయకులకు తంతుగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న, మొన్నటి వరకు ఐదేండ్ల పాటు అధికారంలో ఉన్న వైసీపీ అధికారం కోల్పోవడంతో కూటమిలోకి వరుస కడుతున్నారు. విశాఖలో సుమారు 15 మందికి పైగా వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేన పార్టీలోకి మారిని సంగతి తెలిసిందే. తాజాగా విజయవాడలోనూ వైసీపీ నాయకులు అధికార పార్టీలోకి జంప్ అవుతున్నారు. గురువారం విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిఆధ్వర్యంలో ముగ్గురు కార్పొరేటర్లు మైలవరం రత్నకుమారి, మైలవరం లావణ్య, హర్షద్‌తో పాటు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.ఈ సందర్భంగా వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ నగరం అభివృద్ధి కోసం అనేక మంది టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో విజయవాడలో విపక్షపార్టీలకు కార్యకర్తలు దొరకడం కష్టమని పేర్కొన్నారు.

# తమ ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించారు

**జేసీ కుటుంబాన్ని అదుపులో పెట్టండి..**

**తాడిపత్రి అల్లర్ల నేపథ్యంలో చంద్రబాబుకు వైసీపీ నేత విజ్ఞప్తి**



**విశ్వంభర, తాడిపత్రి :** తాడిపత్రి అల్లర్ల నేపథ్యంలో జేసీ కుటుంబం అరాచకాలపై వైసీపీ నేత కందిగోపుల మురళి మండిపడ్డారు. మూడు రోజుల క్రితం జేసీ వర్గీయులు తమ ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించారని అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తాడిపత్రి అల్లర్ల ఘటనను వివరించారు.మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కాల్ చేస్తే ఆయన ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించానని.. అప్పుడు తనపై జేసీ వర్గీయులు దాడికి దిగారని వైసీపీ నేత మురళి తెలిపారు. దీంతో తాను భయపడి వెనక్కి వచ్చేశానని చెప్పారు. కాసేపటికే వారంతా తమ ఇంటిపైకి దాడి వచ్చారని పేర్కొన్నారు. వందల మంది మారణాయుధాలతో తమ ఇంటిపైకి వచ్చి దాడి చేశారని తెలిపారు. ఇసుప తలుపులను, కిటికీలను పగులగొట్టి మరీ ఇంటి లోపలికి వచ్చారని తెలిపారు. టీడీపీ నేతల అరాచకంపై ఫోన్ చేసినా పోలీసులు రాలేదని చెప్పారు. పదే పదే ఫోన్ చేస్తే 45 నిమిషాల తర్వాత వచ్చారని చెప్పారు. చిన్న పిల్లలు, ఆడవాళ్లపై దాడులు చేసి.. తిరిగి తనపైనే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.తనకు గన్ లైసెన్స్ ఉన్నప్పటికీ ఫైరింగ్ చేయలేదని మురళి తెలిపారు. గొడవ అంతా అయిపోయిన తర్వాతే గన్ తీసుకుని బయటకు వచ్చానని స్పష్టం చేశారు. చిన్న పిల్లలు, ఆడవారిపై జేసీ కుటుంబం దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి చేసే రాజకీయాలు ఇవేనా అని మండిపడ్డారు. జేసీ కుటుంబాన్ని అదుపులో పెట్టాలని ఏపీ సీఎం చంద్రబాబుకు సూచించారు.

# ఫార్మా కంపెనీపై కేసు నమోదు చేశాం: కొల్లు రవీంద్ర

**విశ్వంభర, అనకాపల్లి:** అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ప్రమాదం దిగ్భ్రాంతి కలిగించిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. 17 మంది మృతిచెందడం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేశామన్నారు. కంపెనీ నుంచి బాధితులకు పరిహారం ఇప్పిస్తామని వివరించారు. ప్రభుత్వం తరపున కూడా సహకారం అందిస్తామన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. చివరి బాధితుడి వరకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. సీఎం చంద్రబాబు నేడు బాధితులను పరామర్శిస్తారని కొల్లు రవీంద్ర తెలిపారు.



# ఏపీలో న్యాయం, ధర్మం కనిపించడం లేదు..

## చంద్రబాబు సర్కార్‌పై వైఎస్ జగన్ ధ్వజం

**విశ్వంభర, అమరావతి :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్ పనితీరుపై మండిపడ్డారు. టీడీపీలో ఎవరిస్థాయిలో వాళ్లే రెడ్‌బుక్ పేరిట విధ్వంసాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం, వైసీపీ లీగల్ సెల్ విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, న్యాయం, ధర్మం ఎక్కడా కనిపించడం లేదని ఆరోపించారు. బాధితులు పోలీసుస్టేషన్‌కు వెళ్తే ఎదురు కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పత్రాలు కాలిపోతే వైసీపీ శ్రేణులే కారణమంటూ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనలకు టీడీపీ నాయకులే చేసి ఆ నెపాన్ని వైసీపీపై రుద్దుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడిపత్రిలో పోటీ చేసిన పెద్దారెడ్డిని అడుగుపెట్టనీయకుండా టీడీపీ మూకలు దాడులు చేశారని, మురళి అనే కార్యకర్త మీద దాడులు చేసి, ఇంటిని తగలబెట్టారని0వివరించారు.

రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని, బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. వైసీపీ పాలనలో న్యాయవాదుల సంక్షేమానికి వంద కోట్ల రూపాయల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. కొత్తగా వృత్తిలోకి వచ్చే న్యాయవాదులకు మూడు సంవత్సరాల పాటు ప్రతి ఆరు నెలలకొకసారి రూ. 30వేల చొప్పున అందించిన ఘనత వైసీపీదేనని పేర్కొన్నారు.



# మూడు నెలల్లో పరిశ్రమల భద్రతపై కార్యాచరణ సిద్ధం చేస్తాం

- అచ్యుతాపురం ప్రమాదంలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తెలుస్తోంది.
- గ్రామసభల్లో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలి..
- మీడియా సమావేశంలో మంత్రి పవన్ కళ్యాణ్



**విశ్వంభర, మంగళగిరి:** అచ్యుతాపురం ఫార్మా ప్రమాదం చాలా బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. కాలుష్య నియంత్రణ తన శాఖ పరిధిలో ఉందని, భద్రత వేరే శాఖ కిందికి వస్తుందని చెప్పారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని గతంలో చాలా సార్లు చెప్పామన్నారు. ప్రజల ప్రాణాలు, కార్మికుల భద్రత కోసం సేఫ్టీ ఆడిట్ చేయించాలని అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ లో విశాఖ జిల్లాకు వెళ్లి భద్రతా చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం ఏదో ఒక ప్రమాదం జరగడం బాధాకరమని చెప్పారు. సంతాపం తెలిపి పరిహారం ఇవ్వడంతో సమస్య పరిష్కారం కాదన్నారు. రాబోయే 3 నెలల్లో పరిశ్రమల భద్రతపై కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

**గ్రామసభల్లో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలి..**

పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతంపై ఎన్డీయే కూటమి హామీ ఇచ్చిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరిలోని నివాసంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మలిదశ సంస్కరణలు మొదలుపెట్టామన్నారు. పంచాయతీల్లో ఆగస్టు 15, జనవరి 26న ఉత్సవాల నిర్వహణకు నిధులు పెంచినట్లు వివరించారు. గ్రామసభల్లో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేలా చర్యలు తీసుకున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు.

# ప్రయివేటు పాఠశాలలో అగ్నిప్రమాదం..

**ప్రమాద సమయంలో అక్కడే 350 మంది విద్యార్థులు..**






**విశ్వంభర, తిరుపతి:** తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో గురువారం ఉదయం విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. బైరాగిపట్టెడలోని సోక్రటీసు స్కూల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే ఆ సమయంలో పిల్లలు ఎలాంటి గాయాలు అవగా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. స్కూల్ బిల్డింగ్‌లో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. యాజమాన్యం జీ+3 బిల్డింగ్‌లో పాఠశాలను నిర్వహిస్తోంది.ఈ క్రమంలో ఉదయం ఒక్కసారి పాఠశాలల భవనంలో మంటలు వ్యాపించాయి. ప్రమాద సమయంలో పాఠశాలలో మొత్తం 350 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే పెంట్ హౌస్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం సంభవించింది. వేస్ట్ మెటీరియల్స్‌తో పెంట్ హౌస్‌లో ఉండటంతో మంటల తీవ్రత అధికమైంది. మంటలను గుర్తించిన స్కూల్ యాజమాన్యం వెంటనే తరగతి గదుల్లో నుంచి విద్యార్థులను ఖాళీ చేయించేశారు. దీంతో విద్యార్థులకు తృటిలో ప్రమాదం తప్పినట్లైంది.విషయం తెలిసిన తల్లిదండ్రులు ఎంతో ఆందోళనతో పాఠశాలకు చేరుకున్నారు. అయితే తమ పిల్లలు సురక్షితంగా ఉండంతో వారిని వెంటనే ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. మరోవైపు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటల అదుపునకు యత్నిస్తున్నారు. ఏది ఏమైనా ఇంత పెద్ద ప్రమాదం నుంచి విద్యార్థులు క్షేమంగా బయటపడటంతో స్కూల్ యాజమాన్యంతో పాటు విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ఊపిరిపీల్చుకున్నారు.

# అచ్యుతాపురం బాధితులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి : మాజీ మంత్రి బొత్స

**విశ్వంభర, అమరావతి :** అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్‌లోని ఫార్మాలో జరిగిన ఘటన బాధాకరమని వైసీపీ నేత బొత్స సత్యానారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విశాఖ కేజీహెచ్‌లో బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాధితుల ఆవేదన వర్ణనాతీతమన్నారు.మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. పరిహారం చెక్కులు ఇచ్చిన తర్వాతే డెడ్ బాడీస్ తరలించాలన్నారు. గతంలో ఎల్.జి పాలిమర్స్ ఘటనలో అప్పటి వైసీపీ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించనున్నారని ఆయన తెలిపారు.



# రూ.18.52లక్షలతో జంప్..

**నిందితుడిని పట్టుకున్న పోలీసులు**

**విశ్వంభర, నందిగామ:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద చోరీ సొత్తుతో పరారవుతున్న లారీ క్లీనర్ను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.18.52 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నందిగామ పోలీస్ స్టేషన్లో నిందితుడిని ఏసీపీ రవికిరణ్ మీడియా ముందు ప్రవేశపెట్టారు. అనంతరం ఏసీపీ కేసు వివరాలను వెల్లడించారు ."తెలంగాణలోని మధిర నుంచి ఈనెల 17న లారీలో 300 బస్తాల మిర్చిని ఛత్తీస్ గఢ్ లోని బిలాస్పూర్ తీసుకెళ్లారు. అక్కడ విక్రయించిన అనంతరం లారీ డ్రైవర్ షేక్ ఖయ్యూం ఆ డబ్బు తీసుకుని క్లీనర్ పల్లెపోగు కోటేశ్వరరావుతో కలిసి బయల్దేరాడు. అనంతరం క్లీనర్ రూ.18.52లక్షలతో పరారయ్యాడు. దీంతో నందిగామ పోలీసులకు లారీ డ్రైవర్ ఫిర్యాదు చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. వాహనాల తనిఖీ చేపట్టారు. నందిగామ ఆటో స్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న క్లీనర్ కోటేశ్వరరావును పట్టుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేశారు" అని ఏసీపీ తెలిపారు.



# అద్భుతమైన పాత్రలు పోషించిన వెండితెర ఆణిముత్యం చిరంజీవి: చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** మెగాస్టార్ చిరంజీవికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్వయంకృషితో సినీరంగంలో ఎన్నో విజయాలను అందుకుని, అద్భుతమైన పాత్రలు పోషించిన ఆయన వెండితెర ఆణిముత్యమన్నారు. తరాలు మారినా చెక్కుచెదరని ప్రేక్షకాభిమానం ఆయన సొంతమని పేర్కొన్నారు. ఆయన స్థాపించిన ఐ బ్యాంక్, బ్లడ్ బ్యాంక్లు తనలోని మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. చిరంజీవి మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. పేరు సార్థకం చేసుకునేలా ఆయన చిరంజీవిగా ఉండాలని, భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్టు చంద్రబాబు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

# శ్రీశైలం మల్లన్న హుండీ లెక్కింపు.. 20 రోజుల్లో రూ.3.22 కోట్ల ఆదాయం



**విశ్వంభర, శ్రీశైలం:** శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామి అమ్మవార్లకు భక్తుల మొక్కులు, కానుకల రూపంలో రూ.3.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఆగస్టు 2వ తేదీ నుంచి 22వ తేదీ వరకు భక్తులు హుండీలో వేసిన నగదును గురువారం లెక్కించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపు జరిపినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు.మొత్తం 20 రోజుల్లో రూ.3,22,53,862 కోట్ల నగదు ఆదాయం వచ్చినట్లు ఈవో పెద్దిరాజు వెల్లడించారు. నగదుతో పాటు 150 గ్రాముల 100 మిల్లీ గ్రాముల బంగారం, 5 కేజీల 250 గ్రాముల వెండి వచ్చిందని పేర్కొన్నారు.వీటితోపాటు యూఎస్ఏ డాలర్లు 746, కెనడా డాలర్లు 125, ఆస్ట్రేలియా డాలర్లు 50, ఇంగ్లాండ్ పౌండ్స్ 70, సింగపూర్ డాలర్లు 26, యూఏఈ ధీర్హామ్స్ 50, యూరోలు 20, మలేషియా రింగేట్స్ 125, ఖతార్ రియాల్స్ 2, ఒమాన్ రియాల్స్ 1 మొదలైన విదేశీ కరెన్సీని స్వామి అమ్మవార్లకు మొక్కులుగా హుండీలో భక్తులు సమర్పించారు.

# అదానీని కాపాడేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు..

**కేంద్రంపై షర్మిల ధ్వజం**

**విశ్వంభర, విజయవాడ:** అదానీని కాపాడేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. గురువారం నాడు విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, అదానీపై షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. బ్రిటిష్ వారిపై నిస్వార్థంగా పోరాడి, స్వేచ్ఛనే లక్ష్యంగా కాంగ్రెస్ పోరాటం చేసిందని వివరించారు.అలుపెరగని సుదీర్ఘ సమరం చేసి, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిందని చెప్పారు. ఈరోజు, మరోసారి, ప్రజాధనాన్ని లూటీ చేస్తూ, ప్రజల ఆస్తులను విచక్షణారహితంగా దోచుకుంటున్నకార్పొరేట్ జలగలను తరిమికొడతామని హెచ్చరించారు. వారిని పెంచిపోషిస్తున్న, వారిచేతిలో ఉన్న రిమోట్ కంట్రోల్‌తో నడుస్తున్న మోదీ సర్కారుపై కాంగ్రెస్ పార్టీ, దేశం కోసం మరొక పోరాటం సాగిస్తోందని షర్మిల ఉద్ఘాటించారు.



# భారత్‌ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్

## షెడ్యూల్ ప్రకటించిన బీసీసీఐ, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు



**విశ్వంభర(క్రీడా విభాగం):** భారత్‌ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను బీసీసీఐ, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించాయి. వచ్చే ఏడాది జూన్ నుంచి ఆగస్ట్ మధ్య ఈ సిరీస్ జరగనుంది. ఇరు జట్ల మధ్య చివరిసారిగా ఆ దేశంలో 2021లో ఐదు టెస్టుల సిరీస్ జరిగింది. దీనిని 22తో సమంగా పంచుకున్నాయి. ఒక టెస్టు డ్రాగా ముగిసింది. ఇప్పుడీ సిరీస్లో ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ నాలుగో సైకిల్ ప్రారంభమవుతుంది. ఈ సిరీస్కు కెప్టెన్గా రోహిత్ శర్మ వ్యవహరించనున్నాడు. జూన్‌జులై 2025 మధ్య భారత మహిళల జట్టు కూడా ఇంగ్లండ్లో పర్యటించనుంది. మూడు వన్డేలు, ఐదు టీ20లను ఆడనుంది.

**షెడ్యూల్ ఇదే..**

**తొలి టెస్ట్ - 2025 జూన్ 20 నుంచి 24, వేదిక: లీడ్స్**
**రెండో టెస్ట్ - 2025 జులై 2 నుంచి 6, వేదిక: బర్మింగ్హామ్**
**మూడో టెస్ట్ - 2025 జులై 10 నుంచి 14, వేదిక: లండన్**
**నాలుగో టెస్ట్ - 2025 జులై 23 నుంచి 27, వేదిక: మాంచెస్టర్**
**ఐదో టెస్ట్ - 2025 జులై 31 నుంచి ఆగస్ట్ 4, వేదిక: లండన్**

# మంచిగా డబ్బులిస్తే.. నాపాత్ర నేనే చేస్తా: రాహుల్ ద్రవిడ్



**విశ్వంభర(క్రీడా విభాగం):** బాలీవుడ్ నుంచి ఓ ప్రకటన విడుదలైంది. దీంతో మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్ బయోపిక్ గురించి కొత్త చర్చ మొదలైంది. కోచ్గా టీమ్ ఇండియా టీ20 ప్రపంచకప్ గెలవడంలో ద్రావిడ్ కీలక పాత్ర పోషించాడు. దీంతో మిస్టర్ డిపెండబుల్పైనా ఓ బయోపిక్ న్ను చూడాలనేది అభిమానుల ఆకాంక్ష. దీనినే ద్రావిడ్ ముందు జర్నలిస్టు ఉంచారు. ఆ ప్రశ్నకు రాహుల్ తనదైన శైలిలో ఆసక్తికరమైన సమాధానం ఇచ్చాడు.

**ప్రశ్న:** మీ బయోపిక్ తీయాలనుకుంటే.. మీ పాత్రను ఎవరు పోషిస్తే బాగుంటుందని అనుకుంటున్నారు?

**ద్రావిడ్:** ఒకవేళ మంచిగా డబ్బులిస్తే.. నా పాత్రను నేనే పోషిస్తా (నవ్వుతూ). కోచ్గా దేశమంతా పర్యటించడం పై..వన్డే ప్రపంచకపు భారత్ ఆతిథ్యం ఇచ్చింది. మొత్తం పది వేదికల్లో మ్యాచులు జరిగాయి. ఆసందర్భంగా దేశవ్యాప్తంగా పర్యటించడం చాలా బాగుందని ద్రావిడ్ వ్యాఖ్యానించాడు. "అభిమానుల ఆనందాన్ని, క్రికెట్పై అభిరుచిని ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కడం అదృష్టం. నేను ప్లేయర్ గా అక్కడికి వెళ్లలేదు. కోచ్గా ఒక్కో సిటీలో పర్యటించా. చాలాచోట్లకు సరదాగా నడుచుకుంటూ వెళ్లా" అని ద్రావిడ్ గుర్తు చేసుకున్నాడు. వన్డే ప్రపంచ కప్ ఫైనల్కు చేరిన టీమ్ ఇండియా అక్కడ ఆసీస్ చేతిలో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

# పొట్టికప్ విజేతగా నిలిచాం..



## ముందున్నవి ఆ రెండే లక్ష్యాలు: జైషా

**విశ్వంభర (క్రీడా విభాగం) :**

టీ20 ప్రపంచ కప్ ముందు బార్బడోస్ వేదికపై భారత జెండాను నిలబెడతామని అభిమానులకు బీసీసీఐ కార్యదర్శి జైషా మాట ఇచ్చారు. కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమ్ ఇండియా పొట్టి కప్ విజేతగా నిలిచింది. ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2007లో ఛాంపియన్గా నిలిచిన భారత్.. ఇప్పుడు రెండోసారి కప్పు సొంతం చేసుకుంది. తన మాట నిజమైనట్లు తాజాగా సియట్ కార్యక్రమంలో జైషా గుర్తు చేశారు. ఈక్రమంలో మరో రెండు లక్ష్యాలు భారత్ ముందున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ, టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్ జరగనుంది. ఈ రెండింటినీ రోహిత్ సారథ్యంలోనే సాధించాలని జైషా ఆకాంక్షించారు.

"తర్వాత ఏంటి? ఇలాంటి సమయంలో అందరికీ ఒక విషయం గుర్తు చేద్దామనుకుంటున్నా. టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి ముందు.. రోహిత్ మన జాతీయజెండాను బార్బడోస్ వేదిక వద్ద నిలబెడతాడని చెప్పా. మన కెప్టెన్ అలానే చేశాడు. 140 కోట్ల ప్రజల ఆశీర్వాదాలు మనకు ఉన్నాయి. ఇదేవిధంగా వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ, వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబర్ లో మహిళల టీ20 ప్రపంచకప్ కూడా ఉంది.ఎక్సెలెన్స్ ఇన్ స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ అవార్డును టీమ్ ఇండియా మహిళా క్రికెట్ జట్టుతోపాటు..2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ రన్నరప్, 2024 పొట్టి కప్ విజేత అయిన భారత క్రికెటర్లకు అంకితం చేస్తున్నా" అని జైషా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్, విరాట్ కోహ్లి, క్రికెటర్లు పాల్గొన్నారు. ఐసీసీ కొత్త ఛైర్మన్ గా జైషా ఎన్నికవడం లాంఛనమేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆగస్ట్ 27న నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆలోపు ఎవరు అవుతారనే దానిపై ఓ స్పష్టత రానుంది.

# 24 ఏళ్లకే ఆటకు వీడ్కోలు పలికిన ఒలింపిక్ టేబుల్ టెన్నిస్ స్టార్ అర్చనా కామత్

**విశ్వంభర (క్రీడా విభాగం):**

ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్ లో మన టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణులు చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. టేబుల్ టెన్నిస్ మహిళల టీమ్ ఈవెంట్లో క్వార్టర్ ఫైనల్కు చేరుకున్న తొలి భారత జట్టుగా ఘనత సాధించింది. మన జట్టు ఈ రికార్డును చేరుకోవడంలో 24 ఏళ్ల అర్చనా కామత్ కీలక పాత్ర పోషించింది. అయితే, తాజాగా ఆమె సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రొఫెషనల్ టేబుల్ టెన్నిస్ కు వీడ్కోలు పలికింది. అకడమిక్ కెరీర్లో ముందుకుసాగడం కోసం ఆటను వదిలిపెట్టినట్లు ఆమె కోచ్ మీడియాకు తెలిపారు. పారిస్ గేమ్స్ ముగించుకొని భారత్కు తిరిగొచ్చిన తర్వాత అర్చన తన కెరీర్ గురించి కోచ్ అన్షుల్ గార్గ్ సుదీర్ఘంగా చర్చించిందట. నాలుగేళ్ల తర్వాత జరిగే లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ గేమ్స్ పతకం సాధించే అవకాశాలు తక్కువగా ఉండటంతోపాటు ఆర్థిక అవసరాల దృష్ట్యా ఆటకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకున్నట్లు తెలిసింది. "పతకం సాధించడం చాలా కష్టమైన పనే అని నేను చెప్పా. ఆమె వరల్డ్ 100 ర్యాంకుల జాబితాలో లేదు. గత రెండు నెలలుగా ఆమె ఎంతో కష్టపడుతున్నప్పటికీ.. ప్రొఫెషనల్ కెరీర్ కోసం మరింత కఠోర శ్రమ అవసరం అని వివరించా. దీంతో ఆమె విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలని నిర్ణయించుకుంది" అని కోచ్ వివరించారు.ఇటీవల పారిస్ ఒలింపిక్స్కు ఆమెను ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వాటినితిప్పికొట్టేలా విశ్వక్రీడల్లో ఆమె మెరుగైన ప్రదర్శన చేసింది. టీమ్ క్వార్టర్స్లో భారత జట్టు 13తేడాతో జర్మనీ చేతిలో ఓటమిపాలైంది. ఆ మ్యాచ్లో భారత్ తరపున గెలిచింది అర్చనా కామత్ మాత్రమే. ఇదిలాఉండగా.. తన అకడమిక్ కెరీర్ గురించి ఈ ప్లేయర్గతంలోనే బయట పెట్టింది. "మా సోదరుడు నాసాలో పనిచేస్తున్నాడు. అతడే నాకు ఆదర్శం.ఉన్నత చదువుల కోసం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుంటాడు. నేను కూడా ఉన్నత విద్య కోసంసమయాన్ని కేటాయించాలనుకుంటున్నా" అని ఈ ఏడాది ఆరంభంలో అర్చన వెల్లడించింది.

# యూట్యూబ్ ఛానల్‌తో రోనాల్డో వరల్డ్ రికార్డ్



**ఢిల్లీ:** దిగ్గజ ఫుట్ బాల్ ప్లేయర్ క్రిస్టియానో రోనాల్డో.. తన కెరీర్‌లో ఇప్పుడు ఓ కొత్త అడుగు వేశారు. రెండు దశాబ్దాల పాటు ఫుట్ బాల్‌ను శాసించిన అతను.. ఇప్పుడు కాంటెంట్ క్రియేటర్‌గా మారాడు. కొత్తగా అతను యూట్యూబ్ ఛానల్ యూఆర్ క్రిస్టియానోను స్టార్ట్ చేశారు. అయితే ఆ ఛానల్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే రికార్డులు సృష్టించింది. యూట్యూబ్ ఫ్లాట్ ఫామ్‌లో అతి తక్కువ సమయంలో మిలియన్ సబ్‌స్క్రైబర్లు అందుకున్న రికార్డును యూఆర్ క్రిస్టియానో ఛానల్ అందుకున్నది. అంతే కాదు, 24 గంటల్లోనే రోనాల్డో యూట్యూబ్ అకౌంట్ కోటి దాటి వరల్డ్ రికార్డును సృష్టించింది. సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్‌ల్లో.. అత్యధికంగా జనం ఫాలోఅవుతున్న ఫేమస్ పర్సనాలిటీల్లో రోనాల్డో ఒకరు. ఎక్స్ అకౌంట్‌లో ఆయనకు 112.5 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 17 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 63.6 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇన్నాళ్ల వెయిటింగ్ ముగిసిందని, చివరకు యూట్యూబ్ ఛానల్ వచ్చేసిందని, సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని కోరుతూ రోనాల్డో తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

# బుమ్రా కంటే అత్యుత్తమమని ఎవరూ భావించొద్దు: టిమ్

**విశ్వంభర (క్రీడా విభాగం):** టీమ్ ఇండియా స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రా అంతర్జాతీయ క్రికెట్ నుంచి విరామం తీసుకున్నాడు. గత వన్డే ప్రపంచ కప్ నుంచి మొన్న ముగిసిన టీ20 ప్రపంచకప్ వరకు ఖాళీ లేకుండా మ్యాచ్లు ఆడేశాడు. దీంతో అతడికి విశ్రాంతి ఇవ్వాలని శ్రీలంక పర్యటనకూ బీసీసీఐ ఎంపిక చేయలేదు. ఇక బంగ్లాదేశ్తో టెస్టు సిరీస్కు దూరంగా ఉంటాడని ఇప్పటికే క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఆ తర్వాత కివీస్ టెస్టు సిరీస్ లేదా నేరుగా ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల బోర్డర్ గావస్కర్ ట్రోఫీ బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో బుమ్రాపై న్యూజిలాండ్ కెప్టెన్ టిమ్ సౌథీ ప్రశంసల వర్షం కురిపించాడు. సియట్ అవార్డుల కార్యక్రమంలో సౌథీ పాల్గొన్నాడు."తీవ్రమైన గాయంతో ఇబ్బందిపడిన బుమ్రా కోలుకొని వచ్చాక.. పునరాగమనం ఘనంగా చాటాడు. అంతకుముందు కంటే ఇప్పుడు అత్యంత ప్రమాదకారిగా మారాడు. గాయానికి ముందు కంటే ఇప్పుడు చాలా సౌకర్యవంతంగా ఉన్నాడు. అనుభవం పెరుగుతూ ఉండటం కూడా అతడికి కలసివస్తోంది. ఆటను అర్థం చేసుకోవడంలో పరిణతి సాధించాడు. ఇప్పుడు బుమ్రా అత్యుత్తమ వెర్షన్ను చూస్తున్నాం. మూడు ఫార్మాట్లలో అద్భుతంగా రాణిస్తున్నాడు. ప్రస్తుత క్రికెట్లో అతడికంటే మరెవరూ బెటర్గా లేరనేది నా ఉద్దేశం" అని సౌథీ వ్యాఖ్యానించాడు.

# డిసెంబర్‌లో భారత్ మార్కెట్లోకి వన్‌ప్లస్ ఏస్5 సిరీస్ ఫోన్లు..!

**విశ్వంభర (బిజినెస్):** ప్రముఖ చైనా స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ వన్ ప్లస్ తన వన్ ప్లస్ ఏస్5, వన్ ప్లస్ ఏస్5 ప్రో ఫోన్లను ఈ ఏడాది చివర్లో భారత్ మార్కెట్లో ఆవిష్కరించనున్నది. ప్రస్తుతం శాంసంగ్ గెలాక్సీ ఎస్24 ఆల్ట్రా, ఇతర ఫ్లాగ్ షిప్ ఫోన్లలో వినియోగిస్తున్న క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 8 జెన్ 4 ఎస్వోసీ ప్రాసెసర్‌ను వన్ ప్లస్ ఏస్ 5 ఫోన్ లో వినియోగిస్తున్నారని సమాచారం. అక్టోబర్ 2123 మధ్య హవేలీలో నిర్వహించే స్నాప్ డ్రాగన్ సదస్సులో వన్ ప్లస్ ఏస్ 5 ప్రో ఆవిష్కరిస్తారని భావిస్తున్నారు. ఇదే సదస్సులో షియోమీ తన షియోమీ 15 ప్రో ఫోన్ ఆవిష్కరించనున్నట్లు తెలుస్తున్నది. డిసెంబర్ లో భారత్ మార్కెట్లోకి వన్ ప్లస్ ఏస్5, వన్ ప్లస్ ఏస్5 ప్రో ఫోన్లు రానున్నాయని చెబుతున్నారు.వన్ ప్లస్ ఏస్ 5 ఫోన్ 1.5 కే ఎల్టీపీఓతోపాటు 6.78 అంగుళాల డిస్ ప్లే కలిగి ఉంటుంది. 50మెగా పిక్సెల్ సెన్సర్ మెయిన్ కెమెరాతోపాటు ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటుంది. 100 వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6200 ఎంఏహెచ్ కెపాసిటీ డ్యుయల్ సెల్ బ్యాటరీ వస్తుందని సమాచారం.



# పునరుత్పాదక ఇంధన రంగంలోకి బీసీ జిందాల్ గ్రూప్

**విశ్వంభర (బిజినెస్):** బీసీ జిందాల్ గ్రూప్ గురువారం భారతదేశ పునరుత్పాదక ఇంధన రంగంలో తన ప్రవేశాన్ని ప్రకటించింది. వచ్చే ఐయిదేళ్లలో 2.50 బిలియన్ డాలర్ల (రూ.20,750 కోట్లు) పెట్టుబడి పెట్టే యోచనలో ఉంది. ఒడిశాలోని అంగుల్ లో ఇప్పటికే 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి పోర్ట్ఫోలియోతో, బీసీ జిందాల్ గ్రూప్కు సంబంధించిన పునరుత్పాదక వెంచరు నిర్వహించడానికి అంకితమైన సంస్థను ప్రారంభించిదని ఒక ప్రకటనలో తెలిపింది. రూ.18 వేల కోట్ల టర్నోవర్తో భారత్లోని ప్రముఖ బహుళ ఉత్పత్తుల సంస్థ అయిన బీసీ జిందాల్ గ్రూప్..పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, సోలార్ సెల్స్, మాడ్యుల్స్ తయారీ మొదలగు వ్యాపారాలను నిర్వహిస్తోంది. జిందాల్ ఇండియా రెన్యూవబుల్ ఎనర్జీ(జిర్) సోలార్, విండ్, హైబ్రిడ్, ఎఫ్ఎఆర్ మోడ్స్ నుంచి 5 గిగావాట్ల విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీంతోపాటు, సోలార్ డిమాండ్ను ఉపయోగించుకోవడానికి జిర్. పీవీ సెల్స్, మాడ్యూల్స్ను కూడా తయారు చేస్తుంది. జిర్ బీసీ జిందాల్ గ్రూప్ కింద పనిచేస్తుంది.



# ఈ కామర్స్ సంస్థలకు భారత్ వ్యతిరేకం కాదు..

## కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్

విశ్వంభర (బిజినెస్): ఈ కామర్స్ సంస్థలకు భారత్ వ్యతిరేకం కాదని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ అన్నారు. ఆ సంస్థలు న్యాయంగా, నిజాయతీగా వ్యాపారాలను సాగించాలని మాత్రమే ప్రభుత్వం కోరుకుంటోందని తెలిపారు. దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈ కామర్స్ కల్చర్పై ఆందోళన వ్యక్తం చేసిన గోయల్.. ఈ తరహా సంస్థలు పుట్టుకొస్తుండడాన్ని గొప్ప విజయంగా భావించరాదంటూ బుధవారం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

ఇదే అంశంపై తాజాగా మాట్లాడిన పీయూష్ గోయల్.. విదేశీ పెట్టుబడులను, సరికొత్త టెక్నాలజీలను దేశంలోకి ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఆన్లైన్ వ్యాపారాలకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఈ కామర్స్ సంస్థల పోటీ నివారించేందుకు సదరు కంపెనీలు అనుసరిస్తున్న ధరల విధానం వల్ల సంప్రదాయ రిటైల్ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్ వ్యాపారాలతో పోటీ పడేందుకు ఇతర వ్యక్తులకు కూడా సరైన అవకాశం ఉండాలన్నారు. సమయానికి వస్తువులను అందుబాటులోకి తీసుకురావడం, సౌలభ్యం వంటి అనేక ప్రయోజనాలు ఈ కామర్స్ సేవల వల్ల ప్రజలు పొందుతున్నారని తెలిపారు. ఇలాంటి కంపెనీలు దేశ ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు.



**సంప్రదాయ రిటైల్ మార్కెట్‌ను కూలదోస్తున్నాయ్**

దేశీయ ఆన్‌లైన్ మార్కెట్‌పై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఈకామర్స్ వృద్ధి ఆందోళనకరమైన అంశమేనని వ్యాఖ్యానించారు. ఈకామర్స్ సంస్థలు అవలంభిస్తున్న ధరల విధానం బాగాలేదని, సంప్రదాయ రిటైల్ రంగాన్ని అది కూలదోస్తున్నదని మండిపడ్డారు. బుధవారం ఇక్కడ 'భారత్‌లో ఉపాధి, వినియోగదారుల సంక్షేమంపై ఈకామర్స్ నికర ప్రభావం' నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంప్రదాయ రిటైల్ మార్కెట్‌లో ఉద్యోగఉపాధి అవకాశాలను ఈకామర్స్ వేదికలు దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే 'ఈ దేశానికి ఈ రకమైన ధరల విధానాలు లాభం చేస్తాయా?' అని ప్రశ్నించారు. తక్కువ ధరలతో సంప్రదాయ మార్కెట్‌కు వినియోగదారులను ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలు దూరం చేస్తున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే వీధుల్లో దుకాణాలు మూతబడటం ఖాయమన్నట్టుగా మాట్లాడారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌తో అంతా ఎక్కడికక్కడే షాపింగ్ చేస్తున్నారని, దీనివల్ల సమాజంలో ఒక రకమైన అంతరం కూడా వ్యాపిస్తున్నదని చెప్పారు.

**అమెజాన్‌తో ఒరిగేదేమీ లేదు...**

ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో పెడుతున్న పెట్టుబడులు ఇక్కడ దానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేసుకోవడానికేనని గోయల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెజాన్ దాని స్వలాభం కోసమే భారత్‌లో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ప్రకటించిందని, అంతేతప్ప భారత్‌కు మంచి చేద్దామని మాత్రం కాదన్నారు. ఆన్‌లైన్ మార్కెట్ పెరిగిపోతే చిరు, చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఇదిలావుంటే ఆన్‌లైన్ వ్యాపారులు దేశంలో 1.58 కోట్ల ఉద్యోగాల్ని సృష్టించారని ఈ రిపోర్టు తెలిపింది. ఇందులో 35 లక్షల మహిళలు కూడా ఉన్నారు. 17.6 లక్షల రిటైల్ సంస్థలు ఈకామర్స్ మార్కెట్‌తో భాగస్వాములయ్యాయని కూడా తేలిం ది. అయితే ఈ వృద్ధి దేశానికి మంచి కన్నా భవిష్యత్తులో చెడే ఎక్కువగా చేస్తుందని మంత్రి గోయల్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఐటీ.. పవర్ మినహా లాభాలతో ముగిసిన స్టాక్స్..

- అందరి కన్నూ యూఎస్ ఫెడ్ రిజర్వుపైనే..!

**విశ్వంభర (బిజినెస్):**యూఎస్ ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న సంకేతాల మధ్య వరుసగా మూడో రోజు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఐటీ, పవర్ మినహా అన్ని సెక్టార్ల షేర్లకు ఇన్వెస్టర్ల నుంచి కొనుగోళ్ల మద్దతు లభించింది. వడ్డీరేట్ల తగ్గింపునకు ధృవీకరిస్తూ యూఎస్ ఫెడ్ రిజర్వు నిర్ణయం కోసం ఎదురు చూస్తున్న ఇన్వెస్టర్లు యూఎస్ పీఎంఐ డేటా, ఇండ్ల విక్రయాలు, నిరుద్యోగిత డేటాను ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తున్నారు.బీఎస్ఈ ఇండెక్సు సెన్సెక్స్ 147.89 పాయింట్ల లబ్ధితో 81,053.19 పాయింట్లు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 41.30 పాయింట్లు పుంజుకుని 24,811.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్ టెల్, అపోలో హాస్పిటలర్స్ తదితర స్టాక్స్ భారీగా లాభ పడ్డాయి. టాటా మోటార్స్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఎన్టీపీసీ, విప్రో, మహీంద్రా అండ్ మహీంద్రా తదితర స్టాక్స్ భారీగా నష్టపోయాయి. పవర్ ఇండెక్స్ ఒకశాతం నష్టపోగా, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, ఐటీ స్వల్ప నష్టాలతో ముగిశాయి. మరోవైపు బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, మెటల్, రియాల్టీ, టెలికం ఇండెక్స్ లు 0.51.4 శాతం మధ్య లాభ పడ్డాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 41,834 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లినా ట్రేడింగ్ ముగిసే సమయానికి 41,506.20 పాయింట్లతో నష్టాలతో స్థిర పడింది.

బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు 0.6 శాతం చొప్పున లాభాలతో ముగివాయి. బీఎస్ఈలో అబ్బోట్ ఇండియా, అలెంబిక్, అశోక్ లేలాండ్, భన్సాలీ ఇంజినీరింగ్, కోల్గేట్ పాల్మోలివ్, కోరమాండల్ ఇంటర్నేషనల్, ఫినో పేమెంట్స్, జిల్లెట్ ఇండియా, గ్ర్యాఫిక్ బయో, ఐనాక్స్ గ్రీన్, జుబ్లియంట్ ఫుడ్ వర్క్స్, ఎం అండ్ ఎం ఫైనాన్సియల్, మోర్ పెన్ లాబ్, ఎంఫేసిస్, పరిసిస్టెంట్ సిస్టమ్స్, రాణె మద్రాస్, సుట్లెజ్ టెక్స్ టైల్, ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్, టీవీఎస్ ఎలక్ట్రానిక్స్, టీవీఎస్ మోటార్ తదితర స్టాక్స్ 52 వారాల గరిష్టాన్ని తాకాయి.





## రికార్డుల మోత మోగిస్తున్న క్రైమ్ థ్రిల్లర్..

ఓటీటీల్లో క్రైమ్ థ్రిల్లర్ జానర్ మూవీస్‌కు ఉండే డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ క్రమంలోనే తమిళ విలక్షణ నటుడు విజయ్ సేతుపతి నటించిన మహారాజా మూవీ రికార్డులు సృష్టిస్తుంది. అతని కేరీర్లో 50 వ సినిమాగా వచ్చిన ఈ మూవీ థియేటర్లలో రూ.100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆ తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చి రికార్డులను క్రియేట్ చేస్తూనే ఉంది. 2024 ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఎక్కువ మంది చూసిన ఇండియన్ సినిమాగా విజయ్ సేతుపతి నటించిన మహారాజా నిలిచింది. నిథిలన్ సామినాథన్ డైరెక్ట్ చేసిన ఈ మూవీ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ అయి వారాలు అవుతున్నా ఇప్పటికీ టాప్ 10 ట్రెండింగ్ మూవీస్‌లో ఉంది. అది కూడా 8 దేశాల్లో ఉండటం మరో ఘనత. 2024 నెట్‌ఫ్లిక్స్‌లో రికార్డ్ క్రియేట్ చేసిన క్రూ, లాపతా లేడీస్, సినిమాలను వెనక్కి నెట్టి మహారాజా ముందుకు దూసుకొచ్చాడు. ఇప్పటి వరకూ ఈ సినిమాకి 1.86 కోట్ల వ్యూస్ వచ్చాయి. దీనికి ముందు క్రూ మూవీకి 1.79 వ్యూస్ రాగా, లాపతా లేడీస్‌కు 1.71 కోట్లు వ్యూస్ వచ్చాయి. ఈ రెండు సినిమాలు కూడా థియేటర్లలో రికార్డులు కొల్లగొట్టాయి. అయితే ఇప్పుడు అలాంటి సినిమాలను విజయ్ సేతుపతి మహారాజాతో వెనక్కి నెట్టాడు. ఈ సిమాలో అతనితోపాటు బాలివుడ్ డైరెక్టర్ అనురాగ్ కశ్యప్, భారతీరాజా, అభిరామ్, మోహన్ దాస్ తదితరులు నటించారు. ఈ సినిమాకు కాంతారా ఫేమ్ అజనీస్ లోకనాథ్ సంగీతాన్ని అందించాడు. మహారాజా ఓ క్రైమ్ థ్రిల్లర్ మూవీ. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సాధారణ బార్బర్‌గా నటించాడు. ఓ సందర్భంలో గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంట్లో చొరబడి తమ జీవితాల్లో ఎంతో ముఖ్యమైన లక్ష్మిని ఎత్తుకెళ్లారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాడు మహారాజా. అసలు ఆ లక్ష్మి అన్నది సినిమాలో పెద్ద ట్విస్ట్‌గా ఉంటుంది. కథ మొత్తం దాని చుట్టూ తిరుగుతూ సస్పెన్స్‌లతో మైండ్ బ్లాక్ చేస్తుంది. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీని ప్రేక్షకులు ఊహకందని విధంగా ట్విస్టుల మీద ట్విస్టులతో డైరెక్టర్ రూపొందించాడు. సినిమా స్టార్టింగ్ నుంచి చివరి వరకు ప్రతి సీన్ ఎంతో ఉత్కంఠ రేపుతోంది. ఇది తెలిసిన స్టోరియే అనుకొనే లేపో ట్విస్టులతో పిచ్చెక్కిస్తుంది. ఇది సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. దీని కారణంగానే థియేటర్‌తో పాటు ఓటీటీల్లో దూసుకుపోతుంది. ఈ సినిమాలో విలన్‌గా బాలివుడ్ డైరెక్టర్ నటించడం ప్రధాన బలం. ఆయన విజయ్ సేతుపతితో పోటీపడి నటించాడు. ఓ చిన్న మిస్ అండర్ స్టాండింగ్ జీవితాలను ఎలా మారుస్తుంది అనేది ఈ సినిమాలో చూడొచ్చు.

## చీరలో మిల్కీ బ్యూటీ గ్లామర్ బ్లాస్ట్

స్టార్ హీరోయిన్ తమన్నా సౌత్ మరియు బాలీవుడ్ పరిశ్రమల్లో మంచి క్రేజ్ ని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. కథానాయికగా ఎన్నో సక్సెస్‌ఫుల్ సినిమాలు చేసిన ఆమె గత కొంతకాలంగా స్పెషల్ సాంగ్స్ తోనూ ప్రేక్షకులను అలరిస్తోంది. తనకు ఉన్న గ్రేస్‌ఫుల్ డ్యాన్స్ స్కిల్స్ తో ఏ సినిమాలో ఐటెం సాంగ్ చేసినా, సినిమా హిట్ అయ్యే అవకాశం పెరుగుతుందని అనిపిస్తుంటుంది.కెరీర్ మొదట్లోనే, బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటించిన 'అల్లుడు శీను' చిత్రంలోని "లబ్బర్ బొమ్మ" పాటలో తన డ్యాన్స్ తో ప్రేక్షకులను ఎట్రాక్ట్ చేసింది. తర్వాత "జై లవకుశ", "గని", "స్పీడున్నోడు" వంటి చిత్రాలలో చేసిన స్పెషల్ సాంగ్స్ కూడా ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షించాయి. అయితే, ఆ మధ్య విడుదలైన సూపర్ స్టార్ రజినీకాంత్ "జైలర్" సినిమాలోని "నువ్వు కావాలయ్యా" పాటలో తమన్నా గ్లామర్ షోతో మరోసారి తన ప్రత్యేకతను చూపించింది. ఈ పాటకు వచ్చిన సక్సెస్ సినిమాకు ముందస్తు హైప్ ను పెంచడంలో కీలక పాత్ర పోషించింది. అంతే కాదు, తమన్నా పెంచిన గ్లామర్ డోస్ వల్ల పాట ట్రెండింగ్ లో నిలిచింది. తాజాగా తమన్నా మరో స్పెషల్ సాంగ్ తో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈసారి బాలీవుడ్ లో స్త్రీ 2 మూవీలో "ఆజ్ కా రాత్" అనే స్పెషల్ సాంగ్ లో చిందులేసింది. 2018లో విడుదలైన 'స్త్రీ' మూవీలో నోరా ఫతేహి ఐటెం సాంగ్ చేస్తే, ఇప్పుడు సీక్వెల్ లో తమన్నా గ్లామర్ తో అదరగొట్టింది. ఇక సోషల్ మీడియాలో కూడా అమ్మడు తన గ్లామర్ తో ట్రెండ్ అవుతోంది. రీసెంట్ గా ఫొటో షూట్ లో అమ్మడు చీరలో మాయ చేసేసింది. ఒక స్టిల్ లో చీరకొంగు పై అలా నీళ్ళు చల్లుతూ కనిపించింది. గతంలో ఎన్నోసార్లు గ్లామర్ స్టిల్స్ ఇచ్చిన అమ్మడు ఈ రేంజ్ లో మ్యాజిక్ చేయలేదని కొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ప్రస్తుతం తమన్నా పలు చిత్రాలలో నటిస్తూ, స్పెషల్ సాంగ్స్ తోనూ దూసుకెళ్తోంది. అయితే, గ్లామర్ సాంగ్స్ కన్నా కొత్త కథాంశాలున్న చిత్రాల్లో నటనకు ప్రాధాన్యత ఇస్తే, ఆమె కెరీర్ మరింత మెరుగ్గా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.



## మంచి ఛాన్స్ వదులుకున్న అల్లు అర్జున్..!

అల్లు అర్జున్ ఏదైనా ఈవెంట్ కి పాల్గొంటే చాలు ఆయన ఏం మాట్లాడతాడో అని ఆసక్తి మొదలైంది. ముఖ్యంగా మెగా వర్సెస్ అల్లు అంటూ ఫ్యాన్స్ మధ్య జరుగుతున్న ఈ గొడవల గురించి ఆయన ఏదైనా స్పందిస్తారా అని ఎదురుచూస్తారు. లేటెస్ట్ గా సుకుమార్ వైఫ్ తబిత సమర్పణలో రావు రమేష్ లీడ్ రోల్ లో తెరకెక్కిన మారుతి నగర్ సుబ్రమణ్యం ప్రీ రిలీజ్ ఈవెంట్ కు అల్లు అర్జున్ గెస్ట్ గా వచ్చాడు. తను మైక్ అందుకున్న ప్రతిసారీ తన ఆర్మీ గురించి చెప్పడం కామనే. ఈసారి కూడా స్పీచ్ లో తన ఫ్యాన్స్ ని బంగారం అంటూ వారిని ఖుషి చేశాడు అల్లు అర్జున్. ఐతే ఈ ఈవెంట్ లో అల్లు అర్జున్ ఒక గొప్ప అవకాశాన్ని వదులుకున్నాడని చెప్పొచ్చు. అదెలా అంటే ఎలాగు ఈవెంట్ సొంత వాళ్లదే అన్నట్టు కాబట్టి ఈవెంట్ లో నేడు జరుపుకునే మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే గురించి ప్రస్తావించి ఒక మెగా విష్ అందిస్తే సరిపోయేది. అల్లు అర్జున్ ఎంత పెద్ద స్టార్ అయినా చిరంజీవికి అభిమానే కాబట్టి మెగా ఫ్యాన్స్ అతన్ని ఎటాక్ చేయడం గురించి ఆలోచించే వారు. అలా కాకుండా ఈవెంట్ లో హీరోలను చూసి హీరో అయిన వాళ్లు ఉన్నారు. కానీ ఫ్యాన్స్ ని చూసి హీరో అయ్యానంటూ అల్లు అర్జున్ చెప్పుకొచ్చాడు. అంతేకాదు తన ఫ్రెండ్స్ కోసం తాను నిలబడతానని.. వారి కోసం ఎక్కడికైనా వెళ్తానని చెప్పాడు. అంటే ఇన్ డైరెక్ట్ గా అల్లు అర్జున్ తన స్నేహితుడు వైసీపీ నేత శిల్పా రవి కోసం వెళ్లడం గురించి మళ్లీ చెప్పుకొచ్చాడని ఆడియన్స్ కు అర్థమైంది. అసలే సోషల్ మీడియాలో ఈ ఇష్యూపై మెగా, పవర్ ఫ్యాన్స్ అంతా గరం గరంగా ఉంటే ఇప్పుడు మళ్లీ స్నేహితుల కోసం నేను నిలబడతా అని అల్లు అర్జున్ చెప్పడంపై ఆయన ఏం చెప్పదలచుకున్నాడో అర్థమైంది. ఐతే నిన్న ఈవెంట్ లో మర్చిపోయాడా లేదా కావాలని స్కిప్ చేశాడా అన్నది పక్కన పెడితే నేడు చిరు బర్త్ డే సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు అల్లు అర్జున్. చిరు అభిమాని అన్నది నైట్ ఈవెంట్ లో గుర్తురాలేదా ఇప్పుడు గుర్తొచ్చిందా అంటూ రకరకాల కామెంట్స్ పెడుతున్నారు. ఐతే వాళ్ల మధ్య ఏం జరుగుతుంది ఏంటి అన్నది పక్కన పెడితే.. అల్లు అర్జున్ ఫ్యాన్స్ విషయంలో చేస్తున్న కామెంట్స్ మాత్రం మెగా ఫ్యాన్స్ హర్ట్ అయ్యేలా చేస్తున్నాయి. మరి ఈ గొడవకు ఫుల్ స్టాప్ ఎప్పుడు ఎవరు పెడతారన్నది చూడాలి.



## 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'.. సరైన టైమ్ లో బూస్ట్ ఇచ్చిన బన్నీ




ఆగస్టు నెలలో వచ్చిన చిన్న చిత్రాలకు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు అందుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో వచ్చిన 'అయ్' మరియు 'కమిటీ కుర్రోళ్ళు' చిన్న చిత్రాలుగా విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకొని మంచి హిట్స్ గా నిలిచాయి. ఇప్పుడు అదే ట్రాక్ లో రాబోతున్న సినిమా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం'. ఇది మరొక కామెడీ ఎంటర్టైనర్ కావడంతో మంచి అంచనాలను ఏర్పరచుకుంది. ముఖ్యంగా రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రంపై హైప్ పెరగడానికి మరో కారణం అల్లు అర్జున్ సపోర్ట్. ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బన్నీ హాజరై తన సపోర్ట్ ప్రకటించడమే కాకుండా, తన స్పీచ్ తో మరింత ఉత్సాహాన్ని పెంచాడు. అల్లు అర్జున్ ఈ వేడుకలో చేసిన ఉపన్యాసం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇష్టమైన వారి కోసం తాను ఎప్పటికప్పుడు ముందుకొస్తానని చెప్పిన బన్నీ, రావు రమేష్ సహా ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రశంసించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బన్నీ ఇచ్చిన స్పీచ్ సోషల్ మీడియాలో ఎందరో ఫ్యాన్స్ ను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' పై ఈ ప్రసంగం మరింత ఆసక్తి కలిగించిందని చెప్పవచ్చు. ట్రైలర్ ద్వారా ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ అయ్యాయి. రావు రమేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఒక కామెడీ మూవీగా రూపొందింది. రావు రమేష్ అకౌంట్ లో అకస్మాత్తుగా డబ్బులు క్రెడిట్ అవడం, ఆ పరిణామాల చుట్టూ కథ నడవడం ఆసక్తికరంగా ఉంటుందట. ఇందులో కామెడీ ఎలిమెంట్స్ చాలా బాగున్నాయని ట్రైలర్ తో ఒక నమ్మకాన్ని కలిగించారు. ఇటీవల కాలంలో తెలుగు ప్రేక్షకులు ఇలాంటి కామెడీ చిత్రాలకు మంచి సపోర్ట్ అందిస్తున్నారు. దీంతో, 'మారుతి నగర్ సుబ్రహ్మణ్యం' కూడా అదే లైన్లో విజయం సాధించవచ్చని అనిపిస్తోంది. ఈ సినిమా లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో రూపొందింది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య కలిసి నిర్మించిన ఈ చిత్రాన్ని పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి.

## 'విశ్వంభర' పోస్టర్ వచ్చేసింది

పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత, మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతున్న వేళ.. ఫ్యాన్స్‌లో మరింత జోష్ నింపేందుకు విశ్వంభర ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది యూవీ క్రియేషన్స్ సంస్థ. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారీ సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'. 'బింబిసార' విజయం తర్వాత వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. విక్రమ్, వంశీధర్ రెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ నిర్మాతలు. త్రిష, ఆషిక రంగనాథ్ ఈ సినిమాలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఈ రోజు చిరంజీవి బర్త్ డే సందర్భంగా, అభిమానులకు కానుకగా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్ చూస్తుంటే వావ్ అనిపిస్తుంది. పోస్టర్ లో చిరంజీవి త్రిశూలం పట్టుకొని ఓ భారీ కొండపై కొత్త లోకంలోకి వెళ్తున్నట్టు ఉంది. పోస్టర్ చూస్తేనే సినిమా దానికి తగ్గట్టు ఉండబోతుందని తెలుస్తుంది. ఇక మెగాస్టార్ పుట్టిన రోజున ఇలాంటి పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేయడంతో ఈ పోస్టర్ వైరల్ గా మారింది. ఇక ఈ సినిమా సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10 న రిలీజ్ కాబోతుంది.



## ఓవర్ నైట్‌లో బ్యూటీ తలరాతే మారిపోయింది

ఇమాన్వీ ఇస్మాయిల్... మొన్నటి వరకు ఈ పేరు పెద్దగా ఎవరికీ పరిచయం లేదు. అయితే ఒక్క ఫొటోతో ఈ బ్యూటీ తలరాతే మారిపోయింది. ఓవర్ నైట్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారిపోయింది. ప్రభాస్, హనురాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమాలో ప్రభాస్‌కు జోడిగా.. ఇమాన్వీ ఇస్మాయిల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. అప్పటి వరకు కేవలం యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లకు మాత్రమే పరిమితమైన ఈ బ్యూటీపై ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టి పడింది. సీతారామం చిత్రంతో మృణాల్‌ను తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేసిన హను రాఘవపూడి, ఇప్పుడు మరో బ్యూటీని ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు. ఇటీవల సినిమా పూజా కార్యక్రమంలో ప్రభాస్‌తో దిగిన ఫొటోతో ఇమాన్వీ ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఒక్కసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ బ్యూటీ ఫాలోవర్ల సంఖ్య ఏకంగా లక్ష మంది ఫాలోవర్లు పెరిగిపోయారు. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ బ్యూటీ గురించే చర్చ నడుస్తోంది. ఇంకా సినిమా షూటింగ్ కూడా ప్రారంభమవ్వకముందే ఇమాన్వీకి ఆఫర్లు క్యూ కడుతున్నాయని తెలుస్తోంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com